మిశ్రమం ంజరి

రాయప్రోలు సుబ్బారావు

ప్రథమ ముద్రణము - 1963
500 ప్రతులు

రు 3-50

అజంతా ప్రింటర్స్
సికింద్రాబాదు

పాయలు పాయలుగా విడి
పోయిన నా కన్నెరచనముంగురులకు వే
ణీయోగ్యముగా 'కుచ్చు లు'
పాయనమై నిలుచుతన్ శుభం బిన సుహృదుల్.

అని 'జడకుచ్చులు' సమర్పించుచూ వ్రాసికొంటిని. వ్రాసినవాటిని సురక్షితంగా ఉంచుకోవడము మొదటినుంచీ అలవాటు కాలేదు. సభాపతి శ్రీ శివ శంకర స్వాములు అనేక పర్యాయములు బోధించారు. ఇటీవల ప్రాతకాగితా లన్నీ వెదకడం మొదలుపెట్టాను. ఏవో లభించినవి- కొన్ని వెలుతురు చూడనివి. కొన్ని ఏ మూలనో మొగముచూపి చాలైనవి, మటీకొన్ని ఇటీవల లిఖించినవి. అన్నిటినీ కలిపి 'మిశ్రమంజరి' అనే పేరుతో ప్రకటిస్తున్నాను. కలగూరగంపలాగా తయారయింది ఇందులో పుల్లనివీ తీయనివీ చప్పనివీ కూడా మిశ్రమై గుత్తికొన్నవి. సహృదయులు అభిరుచికొలదీ స్వీకరిస్తారని విశ్వాసము. రుచులలో భేదం సుతారం. నిమ్మపండు పులుపూ దానిమ్మపండు పులుపూ ఒక్కటే అనదు నాలుక. తేనె తీపికీ చెఱుకుపాల తీపికీ ఏదో రవపాలు భేదం లేకపోలేదు. ఇక, కావ్యస్వాదిమం అంతటా ఏకైకంగా ఉండు ననగలమా !

—రాయప్రోలు సుబ్బారావు.
సుభకృత్ ఫాల్గుణ, పూర్ణిమ.

★

విషయానుక్రమణిక

ఓం	vii
మాతృస్తవమ్	viii
అభ్యర్థన	ix
నమోవాకమ్	1
శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం	2
లాలి	9
ఆంధ్ర నవమి	10
ఆంధ్రాభిషేకమ్	13
పిలుపు	16
సోదరీ ! సోదరా !	19
భద్రయాత్ర	21
గురుదేవ రవీంద్ర !	21
ఓ కవీ !	30
క్షమధ్వమ్	32
కృష్ణాష్టపది	35
క్షేత్రయ్య స్తోత్రము	37
త్యాగయ్య స్వామి	40
మహాకవి పోతన	42

మంగళ మాఘమ్	45
శ్రీ రాధాకృష్ణ మహోదయులకు	50
మన్మధావాహన	53
ఉగాది	55
పెండ్లి లగ్నం	57
సంక్రాంతి సంబరము	64
ఉగాది (ప్రభవ)	67
నవరాత్రి	70
విజయదశమి	73
ఆషాఢి	75
ఫాల్గుణీ	90
ప్రాంజలి	98
ఏరుదుపూలు	99
కోయిల	101
పాపమ్	104
అవసాన సమర్పణ	106
చెళ్ళపిళ్ళ మహాకవి	113
కావ్యకంఠ గణపతిశాస్త్రి	114
రామలింగారెడి	115
నందా ఃఁ	117
విస్సన్నపలుకు	124
బ్రహ్మముడి	126

వాణి	131
రేవుపాట	132
వచ్చినావా ! ఎందుకోసమో	134
సరాగం	137
ఉత్కంఠ	139
పల్లెపడుచు	140
కాపుకన్నె	143
దూతిక	145
పారసీకపదాలు	147
ప్రేమార్చన	148
మీరాదేవి గేయము	151
ఊర్వశి	153
శ్రీరవ్యాత్	159
శుభమ్	165

★

ఓం

పరమ పుణ్యవతికి

భరత భూదేవతకు,

తేనె చవుల శ్రుతికి

తెనుగువాగ్భగవతికి,

శారదాభిరతికి

సాహితీ శ్రీమతికి,

సహృదయ సుకృతులకు

సాదర సమర్పణము.

మాతృస్తవమ్

నమో మంగళశ్రీ మహా మాతృ భూమే !
నమో భారతావర్త ధాత్రీలలామే !

నమస్తే హిమాహార్య ధమ్మిల్ల తారా !
నమస్తే త్రివేణీ భర క్షీర ధారా !

అలం దీప్యతే తావకీనా పతాకా !
త్రివర్ణాయితాశోకచక్ర ప్రతీకా !

జ్వలంతీ తవక్షాత్ర శస్త్రాస్త్ర కీలా
వృణీతే స్వయం శాంతి మక్రూర శీలా !

శివం తే సమస్త ప్రజా స్నేహ తంత్రమ్
ధ్రువం భారతీయ స్వరాజ్యం సతంత్రమ్.

★

అభ్యర్థన

(రవీంద్ర గీతము)

ఎచట చేతము భీతి నెరుగదు,
ఎచట ప్రజ తలయె త్తి తిరుగును,
ఎచట విద్యావినయ బుద్ధుల
శిక్షసాగును స్వేచ్ఛగా

ఇండ్లు వాకిండ్లనుచు కట్టిన
ఇరుకు గోడల నడుమ లోకము
భిన్నమై ఇంతింతలై, సం
కుచితము కా దే భువిక.

ఎచట వాక్కులగాధ సత్యమ
హాంతరాళము నుండి వెలువడు
ఎచట విసుగక కర్మ చేతులు
సాచు పరిణతి పొందగా.

దారిచెడి నిర్మల వివేక సు
ధా ప్రవాహము ఎండిపోదెట,
జీర్ణ శుష్కాచారముల బడి
వట్టి యిసుక యెడారులక.

ఎందు మనసు పురోగమించును
నీ ప్రచోదనచేత తిరముగ ;
నిత్య విస్తర నిష్ఠితములగు
ధ్యానకర్మాచరణలఁ.

ఆ మహోన్నత సుస్వతంత్ర
స్వర్గసీమల కభిముఖంబుగ
మేలుకొలుపగదయ్య తండ్రీ !
నా మహాదేశ ప్రజఁ.

★

శ్రీరవ్యాట్

నమోవాకమ్

తెల్లతామరపూలు దేవీ సరస్వతికి
మల్లెపూవులదండ మా తెనుగు చిన్నమకు.

వాల్మీకి శోకంబు పాదుకొనె శ్లోకమై
నన్నయ్య వాకిండ్ల నడిచె మా భారతము.

కాళిదాసుని భణితి కళలు సమర్తాడె
తిక్కన్న పలుకుబడి తిరునాళ్ళ సాగింది.

దండి చరణాల చిందాడె లాలిత్యంబు
శ్రీనాథు నడవళ్ళ చిందె శృంగారంబు.

శూద్రకుని భావాల సుడిసె కోమలికములు
అలసాని వీణె బ్రహ్మానందము ధ్వనించె.

హాలు పదాలలో తేలె ననురాగంబు
చేమకూర పొలాల చినికె కమ్మదనాలు.

★

శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం

కౌసల్యా సుత ! రామా !
భాసించెను పూర్వసంధ్య, భాగవతజనో
పాసిత మీ దైనిక వి
న్యాసము మేల్కొనగదయ్య నరశార్దూలా !

లే లెమ్ము నందనందన !
మేలుకొనుము గరుడచిహ్నమిళితపతాకా !
మేలుకొనవయ్య మాధవ !
త్రైలోక్య సుమంగళ ప్రదానము కొఱకున్.

తల్లీ ! సమస్తజగదావన దివ్యవల్లీ !
గోవిందువక్షమును పొందిన పావవెల్లీ !
శ్రీ స్వామినీ ! శ్రితజనప్రియ పుణ్యధానీ !
శ్రీ వేంకటేశరమణీ ! ఇదె సుప్రభాతమ్.

భజియింప బ్రహ్మ భవ వాసవాంగనల్
తవ సుప్రభాత శుభముల్ ప్రవర్తిలున్,
అరవింద కుంద శరదిందు హాసినీ !
వృషశైలనాథ సుమనస్సువాసినీ !

అత్ర్యాది సప్తఋషివర్యులు సంధ్యావార్చి
ఆకాశతీర్థకమలంబులు సంగ్రహించి
విచ్చేసినారు భవదర్చనకై ప్రపన్నుల్
శ్రీ వేంకటేశ్వర విభో ! ఇదె సుప్రభాతమ్.

బ్రహ్మాది పంచముఖ షణ్ముఖ దైవతేంద్రుల్
త్రైవిక్రమ స్తవ పదావళి నెత్తిపాడన్,
పంచాంగ పర్వము బృహస్పతి విప్పి చెప్పున్,
శ్రీ వేంకటేశ్వర విభో ! ఇదె సుప్రభాతమ్.

సాటాలువిచ్చిన సరోరుహ నారికేళ
పూగద్రుమాంతికములన్ విహరించి వచ్చె
మందానిలంబులు సుగంధ సపర్య సలుప,
శ్రీ వేంకటేశ్వర విభో ! ఇదె సుప్రభాతమ్.

బింగారు పంజరములం దఱగన్ను వెట్టి
శేషించియున్న కదళీఫల పాయసములు
భక్షించి లీలమెయి పల్కును రామచిల్కల్ ;
శ్రీ వేంకటేశ్వర విభో ! ఇదె సుప్రభాతమ్.

వీణన్ బిగించి మధురస్వనమీన తంత్రుల్
గానంబుచేయు భవదీయ చరిత్ర గీతల్,
శ్రీ నారదుండు కరచార సమగ్ర భణితి
శ్రీ వేంకటేశ్వర విభో ! ఇదె సుప్రభాతమ్.

పూదేనెలాని పులకించిన భృంగపంక్తుల్
ఝంకార గీతములతో సంస్తుతింప
వీడున్ సమీప సరసీశతపత్ర శయ్యల్
శ్రీ వేంకటేశ్వర విభో ! ఇదె సుప్రభాతమ్.

ముత్తైదువల్ పెరుగు చిలికెడి గొల్లయిండ్ల
ఘోషించు కుంభములతో కలహించునట్లు
దిక్కుల్ ప్రతిధ్వనుల కిక్కసలాడు కిస్కన్,
శ్రీ వేంకటేశ్వర విభో ! ఇదె సుప్రభాతమ్.

భానుప్రియాబ్జముల పజ్జలుచేరు తేంట్లు
స్వాంగప్రభల భువలయద్యుతు లాహరింప,
భేరీ నినాదమువిధంబున నిస్వనించున్,
శ్రీ వేంకటేశ్వర విభో ! ఇదె సుప్రభాతమ్.

భక్తేష్ట దాననిరతా ! శ్రితపారిజాత !
శ్రీ శ్రీనివాస ! జగదేక దయావిలాస;
శ్రీ దేవతాయతన దీపకళాప్రకాశ !
శ్రీ వేంకటేశ్వర విభో ! ఇదె సుప్రభాతమ్.

శ్రీ స్వామి పుష్కరిణిలో జలమాడి, వార్చి,
కళ్యాణకాములు సనందన శంకరాదుల్
ఉన్నారు వాకిటను బెత్తపు దెబ్బ లోర్చి
శ్రీ వేంకటేశ్వర విభో . ఇదె సుప్రభాతమ్.

శ్రీ వేంకటాచల - వృషాచల - శేషశై ల-
నారాయణాద్రి - వృషభాద్రి - మహోఖ్యలందె
నీ నిత్యమంగళ హిరణ్మయ దివ్యవసతి;
శ్రీ వేంకటేశ్వర విభో ! ఇదె సుప్రభాతమ్.

ఇంద్రాగ్ని - దండధర - నైర్ఋతి - పాశి - పవన -
యక్షేశ - శూలి - సుర లానతమి స్తకముల
విన్యస్తహస్తులయి నిల్చిరి సేవకొఅకు
శ్రీ వేంకటేశ్వర విభో ! ఇదె సుప్రభాతమ్.

నాగాధిరాజ - గజరాజ - మృగాధిరాజ -
మాతంగరాజ - హయరాజ - సువాహనాళి
ధాటీ ముఖాధిరతి నిల్చిన దాజ్ఞలంద;
శ్రీ వేంకటేశ్వర విభో ! ఇదె సుప్రభాతమ్.

స్వర్లోకపారిషదముఖ్యులు సౌమ్య - భుక్ర -
సూర్యేందు - మంద - కుజ - సంయత రాహుకేతుల్
వీక్షింత్రు నీ చరణ దాస్య పరాయణాస్ధ;
శ్రీ వేంకటేశ్వర విభో ! ఇదె సుప్రభాతమ్.

నీ పాదధూళి కణముల్ శిరసావహించి
స్వర్గాపవర్గ నిరపేక్షిత చిత్తులగుచు,
కంపింత్రు భక్తులు యుగాంతర పాతభీతి,
శ్రీ వేంకటేశ్వర విభో ! ఇదె సుప్రభాతమ్.

నీ దివ్యగోపుర శిఖాంచల దర్శనమున
స్వర్గోపభోగములు పొందగ జాలు నరులు,
భూలోక వాసమునె కోరుదు రంతరముల,
శ్రీ వేంకటేశ్వర విభో ! ఇదె సుప్రభాతమ్

శ్రీ భూమి నాయక ! దయామయ ! పుణ్యమూ ర్తీ !
శ్రీ దేవ ! దేవ గణపాలక చక్రవ ర్తీ !
శ్రీమ ద్విహంగమ భుజంగమ పూజితాంఘ్రి !
శ్రీ వేంకటేశ్వర విభో ! ఇదె సుప్రభాతమ్.

శ్రీ పద్మనాభ ! పురుషో త్తమ ! భోగి శయన !
శ్రీ వాసుదేవ ! మధుసూదన ! కంసమధన !
శ్రీవత్సలాంఛన ! జనార్దన ! చక్రహ స్త !
శ్రీ వేంకటేశ్వర విభో ! ఇదె సుప్రభాతమ్.

కందర్ప గర్వహర కోమల కామరూపీ !
గోపీ నిజాంతర నిదాఘ తుషారవాపీ !
కళ్యాణ సాంద్రగుణసాగర పర్వచంద్ర !
శ్రీ వేంకటేశ్వర విభో ! ఇదె సుప్రభాతమ్.

శ్రీ మత్స్య ! కచ్ఛప ! వరాహ ! నృసింహ ! వర్ణి !
శ్రీరామచంద్ర ! భృగురామ ! బలాంకరామ !
శ్రీ నంద నందన ! తథాగత ! కల్కిరూపా !
శ్రీ వేంకటేశ్వర విభో ! ఇదె సుప్రభాతమ్.

ఏలాలవంగ ఘన సార సుగంధి జలము
మిన్నేట కాంచన ఘటంబుల నించి తెచ్చి
సంతుష్టిమై నిలిచి యన్నది వైదికాళి,
శ్రీ వేంకటేశ్వర విభో ! ఇదె సుప్రభాతమ్.

భానుండు వచ్చె కమలంబులు విచ్చి లేచె,
పూరించె దిక్కుల కలధ్వనులన్ శకుంతముల్,
శ్రీవైష్ణవుల్ నిలిచి రక్షయ మంగళేచ్ఛన్,
శ్రీ వేంకటేశ్వర విభో ! ఇదె సుప్రభాతమ్.

పద్మాసనాదులు-సనందన దేవఋషులు
యోగీంద్రులుక కలసి మంగళ వస్తు హస్తు
లై నిల్చినారలు కవాటము నాశ్రయించి
శ్రీ వేంకటేశ్వర విభో ! ఇదె సుప్రభాతమ్.

లక్ష్మీనివాస ! ఋభలక్షణ పీనవక్ష !
సంసార కిల్బిషతమాల జటా కుఠార !
లక్ష్మీనివాస ! నిరవద్య ! మురారి ! శౌరి !
శ్రీ వేంకటేశ్వర విభో ! ఇదె సుప్రభాతమ్.

ఈ సుప్రభాతము, వృషాచలనాథగీత
మే మానవుండు ప్రతివాసరమున్ పఠించు ;
ఆ మానవుం డనుభవించు ప్రభాతవేళ
ప్రజ్ఞాపరార్థ పరమావధి భోగమును.

ఈ సుప్రభాత గీతలు
వ్రాసితి తెనుగున అశేష పామరజన ము
ల్లాసముతో వినగా, భా
షా సరణిని పాడగా నుషఃకాలములన్.

★

లాలి

లాలీ కుమార! లవలీ సుకుమార లాలీ!
లాలీ కిశోర! తులసీదళహార లాలీ!

కేలీకదంబవనకుంజవిహార లాలీ!
కాలిందినీ సికతచుంబితపాద లాలీ!

గోపీనితంబ ధవళాంబర చోర లాలీ!
బృందావనీముఖరవేణువినోద లాలీ!

రాసోత్సవాభినయరంజితగోపబాలా!
రాధా శిఖుప్రియ సుధాసరసీమరాలా!

★

ఆంధ్రనవమి*

జననీ! ఆంధ్ర మహామహీ! ఇది
భవత్సాన్వితంత్ర్య పుణ్యాహవా
చనపారాయణ; మేలవించితిమి
స్వేచ్ఛార్తకంఠశ్రుతుల్,
వినిపింపంగదె, ఛావిభారత
సుఖావిచ్ఛిన్న సాఫల్య సా
ధనమున్ గాంధి ముఖోపదిష్ట
నవనీతప్రీతి మద్గీతముల్.

చీకట్లు చీలి విచ్చెను తూర్పురేఖికలు
తెల్లవారెనటంచు తిలకించి పులకించి,
ఉయ్యాలలూగు ప్రత్యూష కన్యకకాళ్ళ
కడియాల మ్రోతలన్ కాంక్షించి లక్షించి,
దిక్కులే యెలుగింప నిక్కి కూజించు పు
ల్లుల మేలుకొలుపులకు వలపెత్త తలలెత్తి,
తరుణ తరణిస్మేర కిరణాలలో స్వతం
త్రోదయావభృథంబు నూహించి గాహించి,

---

* రాష్ట్రావతరణం "నవమి" తిథిని జరిగింది.

గట్టెక్కినట్లు - స్వర్గము చేరికొన్నట్లు
తలపోతలను మునిగి - తలుపులన్నీ తెరచి,
మైమరచి - మత్తిల్లి - ప్రొగన్ను వేసితిమి,
ఇంటాబయట చూడు మేమరక జాగ్రత్త.

బంగారు పాతళ్ళ ప్రాణాలు విడిచేమ
హా కుబేరులకాంక్ష కాక దిగజారవలె,
పెను చీకటి బజార్ల ధనము రాసులు చేయు
వర్తకుల నడతలో వంకరలు తీరవలె,
లంచాలు త్రాగి కల్మషమైన అధికార్ల
ముసుగు బొందల చాళ్ళు మొదలంట కదలవలె,
పుట్టింటికే నిప్పు పెట్టగలరాక్షసుల
ఇనుపగుండెల తిత్తు లిగిరించి విరియవలె,
కూటికై అలాడి గుడకై అఱాడు
జనఘోష పగబాటి - సన్నగా రగిలి - ప్ర
చండమై మండితే చల్లార్పగారాదు;
కాదోయి ! ఇది భేదవాదాలకాలంబు.

తలపూలు నీహారనిలయ శృంగార తా
రామౌక్తికములతో రాపాడిరమణింప,
చరణాభరణపంక్తి అరుణోదయకుమారి
సీమంతకుంకుమా సిక్తమై రక్తింప,

తనుభాగ్యములు హరిన్నవసస్యకాండ లా
వణ్య శోభలతో రువాణించి రాణింప,
కంఠశ్రుతుల్ త్రయీగానస్వరాల బ్ర
హ్మానంద తాదాత్మ్య మందించి స్పందింప,
శ్రీమించు నీరూపు ఛిద్రమై ఛిన్నమై
అందచందములాపె అందదుకులపటాన
కట్టవమ్మ అఖండ కనకాంబరము మరల
కన్నవారికి తల్లి కండ్లపండువుగాక.

మూడు మూలల మేయు పాడియావులపాలు
ఏకభాండమునందు పాకమై పొంగాలె,
గింజ కుంచంబుగా గెలవేల గుత్తిగా
పండ్లతోటలు చేలు పండాలె నిండాలె,
గౌతమీ కృష్ణానదీతీర్థ బద్ధమై
రామపదసాగరము రావాలె రావాలె
వేంకటేశ్వర విశ్వవిద్యాలయమునందు
తెలుగు కన్నెకు పసుపు తలబ్రాలుపోయాలె
నీదు నిర్లక్ష్యంబు నీ యదేష్ట మతంబు
కట్టిపెట్టాలోయి నీ కన్నదేశానికై
తరతరాల విపత్తు తప్పింపవలెనోయి
పడుచువాడ! స్వతంత్ర భరతజాతీయుడా.

★

ఆంధ్రాభిషేకమ్

జయస్తే విశాలాంధ్ర జననీమతల్లికా।
శ్రియస్తే తెలంగాణ చికుర నవమల్లికా,

ముకోటి కులదీప ముఖముల్ నివాళింప,
అభిజనశ్రీచక్ర మభయముద్ర వహింప,
భద్రపద పుణ్యాహవాచనము శ్రుతినింప,
పరిధవిల్లినది నీ
పట్టాభిషేకంబు

॥జయస్తే॥

గౌతమీకరవీచికలు పతాకల నెత,
పసుపురాసులు చెఱుకుపాలు పంచగ కృష్ణ,
తుంగభద్రాపూర్ణ మంగళోదకముతో
సాగినది నీ రాష్ట్ర
సంప్రతిష్ఠాపనము.

॥జయస్తే॥

శాతవాహనుల శాసనశిలల్ పలుకంగ,
కాకతీయ రథాల గణగణల్ వినబడగ,
చాళుక్య పర్వాలు జయభారతముపాడ,

సమకొన్న దాంధ్ర భా
షారాష్ట్ర కల్పంబు

॥జయ నే॥

కవుల వాగమృతంబు - గాయకుల స్వరమధువు
చిత్రరంజన రక్తి - శిల్పరూపణ శక్తి -
మిళితమై స్మృతిలోన పులకించి వలపింప
జరిగినది నీ రాష్ట్ర
జన్మోత్సవ శుభంబు

॥జయ స్తే॥

నాగార్జున రసాయన రహస్యములు తేల్చి,
హాలకవి శృంగార మాలికలు సిగదాల్చి,
రుద్రమ్మ పౌరుషారుణసూక్తము రచించి,
రాణించెగా తెనుగు
రతనాల నడిగడ్డ

॥జయ స్తే॥

నాల్గుకోట్ల మహాంధ్ర నాగరక జనకాంక్ష,
నలుబదేండ్ల నిరూఢ బలవదుద్యమ దీక్ష,
ఈడేరినది ఆంధ్రు లేకీభవింపండి
ఇరుగుపొరుగులు నచ్చ
హితులు నహితులు మెచ్చ
ఈడేరినది ఆంధ్రు లేకీభవింపండి

॥జయ స్తే॥

వేయేండ్ల కామ్యమిది పూయవలె పండవలె,
ప్రజలక్షేమము నెంచి పక్షికక్షలు డించి,
నడపండి రాష్ట్రితంత్రము మ్లుపడకుండ,
దేశప్రతిష్ఠల్ ప్ర
కాశంబు కావాలె
నడపండి రాష్ట్రితంత్రము మ్లుపడకుండ

జయత్తే విశాలాంధ్ర జననీమతల్లికా
శ్రియత్తే తెలంగాణ చికుర నవమల్లికా

★

పిలుపు

మేలుకోవోయ్ భరతపుత్రా !
మేలుకోవోయ్ చిరచరిత్రా !
పిలుచుచున్నది వీరభారతి
ఎలుగువినబడ నంతటన్.

నీ మాతృదేశంపు సీమలన్నీ నేడు
ఏమాయెనో చూడు ఏమరికలో నుండ
మంచి మాటాడుచూ వంచించి నమ్మించి
అట్టె తెగిపడ్డాడు
పొట్టి చీనావాడు మేలుకో...

తూర్పు తలకడ దొంగతోడేళ్ళు మూగినవి,
ఉత్తరపు వాకిండ్ల ఉద్రేక మెగసింది,
ఎట్టి చీమలపుట్ట నెట్టెపడి పగిలింది,
వెట్టి సేనలమంద
చుట్టుపట్ల దిగింది మేలుకో...

లేవరా పాలుమాలిక లింక చాలించి,
కట్టరా నీ వీరకాశె నడుముబిగించి,
పట్టరా ఒక చేత భద్ర భగవద్గీత

పట్టరా ఒకచేత
పదును పెట్టిన కత్తి. మేలుకో...

కుల కక్షలో ఎన్నికల మొత్తుకోళ్ళలో
పరిమిట్ల తెరచాటు తిరగండ్ల పాటులో,
చీకటి బజార్ల సినీమాలలాభాల
ప్రొద్దస్తమానాలు
పొర్లి తేలడమాయె. మేలుకో...

కసిపోని ముసలి నక్కను చూడు నట్టింట
కనిపెట్టు తలకొఱివి కొమ్మేళ్లు పుట్టింట,
—కల్ల వేదాంతాలు కపట సిద్ధాంతాలు—
పడగ ముడిచినపాము
పగ నమ్మరాదోయి. మేలుకో...

ఈ హిమాలయ సీమ- ఈ నదీనదపంక్తి-
ఈ మహారణ్యాలు- ఈ చరాచరకోటి
ఏనాడు వెలిసెనో- ఏ ఋషులు పెంచిరో
నేడు నా దంటాడు
నెట్టుకొని వచ్చాడు. మేలుకో...

తలచీర చెరిగినా-పొలిమేర జరిగినా
జాతిపేరు ప్రతిష్ఠ సన్నగిలి అణగారు,
త్రిప్పించి మళ్ళించి తిరిగిరాని విధాన

కొట్టరా చీనీల
గట్టు దాటేదాక. మేలుకో...

నూరు పువ్వులుపూచి-నూరు వన్నెలు విచ్చి
ఇరుగు పొరుగుల తోట లెదగాలె నంటాడు;
చీనా దగాదారి జిత్తు పన్నాగమిది;
కాడి విరిగినగాని
కథ పూర్తికాదోయి. మేలుకో...

స్నేహాల ముచ్చట్లు-ద్రోహాల మంత్రాలు-
కల్లకపటాలొక్క కడవలోనింపాడు.
బయిసిమాలి పరాకు పడరాదు-విడరాదు;
లేవరా నీజాతి
లావు చేవలుమెరయ మేలుకో...

కొట్టాలె చీనీల
గట్టు కావలిదాక
మేలుకోవోయ్ భరతపుత్రా!
మేలుకోవోయ్ చిరచరిత్రా!

★

సోదరీ ! సోదరా !

పాడవే సోదరీ ! వేడివేడి పదాలు
వాడవాడల పడుచు కోడెలను కవ్వించి
పాడవే సోదరీ !....

కొట్టరా సోదరా ! గట్టిగా రణభేరి
చుట్టాలుపక్కాలు శూరులై లేవంగ
పాడరా సోదరా !....

పెట్టవే బిడ్డలకు గొట్టుకారపు ఉగ్గు
కట్టింపవే వీర కాశె మగవారిచే
పాడవే....

హరియింప లేదెపుడు ఇరుగుపొరుగుల సొత్తు
పరదేశములమీద పరుగెత్తిపోలేదు
పాడరా....

ఈసుతో కుమిలి దురాశతో దగ్ధమయి
త్రోసుకొనివచ్చాడు దొంగ చీనావాడు
పాడవే....

జనము హతమగునంచు జంకుజాలీలేదు
తనకాది దున్నలయి తట్టాడమంటాడు
పాడరా....

హింసయని గొంకితే నపుంసకుల మంటాడు
ధ్వంసమే సకలార్థ ధర్మపదమంటాడు
పాడవే....

చీనా వినాయకుల చేటు సిద్ధాంతమిది
బానిసీవాదులను పట్టిబంధించాలె
పాడరా ...

ఉన్నదేలోకాన ఉన్మాదులకు మందు
వెన్నువిరుగని పాము విడుచునే తలపగను
పాడవే....

క్రూరులై అరుల - కక్రూరులై ఆప్తులకు-
ధీరులై నడపాలె మీరాజ్య తంత్రమును
పాడరా....

ఇది నా స్వదేశంబు ఇది నా స్వరాజ్యంబు
గదిమినా చదిమినా కరవాల మిదెయంచు
పాడవే....

★

భద్రయాత్ర

I

ఎత్తవోయి-పయికెత్తవోయి-నీ
స్వేచ్ఛాభారత సీమలజెండా
మూడు వన్నెలును ముచ్చిచ్చులుగా
చీనానేనల కాల్చాలోయ్.

మాతృదేశ తలమకుటము హిమగిరి
తాకెను చీనా 'చా' కావరమున
నల్లమందులో నానిన ఘటముల
పగలగొట్టవోయ్ పైకెత్తీ.

దూకు నదులు విద్యుత్తుల నెత్తగ
మరుభూములు మాగాణీ పొలములుగ
మారుతున్న నీ మాతృవైభవము
చీనా కండ్లను చిలికెను కారము

అన్నవస్త్ర విద్యాప్రణాళికలు
కృషిపరికర కర్మాగారంబులు
భారీ నౌకానిర్మాణంబులు
చీనాకాష్టము రగిలించెన్.

ప్రొద్దులు పొడిచే పుణ్యమండలము
జీవనదులు వచ్చే తలవాకిలి
రెండు వైపులన్ గండక త్తెరను
తగిలించాదోయ్ చౌ కసాయా.

పెనగులాటలను పనిపాటలు చెడ,
ఆకలి కాకల కల్లాడగ ప్రజ,
దేశదేశముల స్తిమితము చెరచు పె
విప్లవకారుల తంత్రంబోయ్.

కడుపులుకాలే కష్ట చినీయుల
'మనదే దేశము మళ్ళీ కొనుడని'
కల్ల కథలతో కయిపెక్కించీ
సాగదోలెనోయ్ చౌయిన్‌లాయ్.

దిక్కులేని దుర్దిన దుర్దశలను
సాయపడితిమీ చైనా మొసలికి
కోరలు సాచెను నోరు తెరిచి యిటు
పాముకు పోసిన పాలాయెన్.

నీతి నియమములు పాతరపెట్టీ
కల్లగజ్జలను కత్తులుదాచీ
కొండలమాటున కోడిపందెమును
చౌ లై ఆడెను జాగ్రత్తోయ్.

సావాసంబని సంధిమాటలని
ఏమరించి వంచించి పయింబడె
మిత్రద్రోహము-మాతనుతాకిన
మత్తుల హతమార్చాలోయ్.

కలదు కలండని పలికే దేవుడు
కలడో లేడో కనబడ డెవరికి
కలదు-కలదు నిను కన్నదేశమిది
నిత్యము సత్యము నిశ్చయమోయ్.

II

పాతగుడ్డలు పారవేతుము
క్రొత్తమడతలు కట్టుకొందుము
చావు బ్రతుకుల సత్యమింతే
ఎందుకో సందేహాముల్.

జంతువులుగా మార్చి జనులను
బందిఖానా చేసి దేశము,
సాగు చీనా యేలుబడి—వా
కట్లతో తలకొట్లతో—

దేశమంటే మట్టికాదోయ్
దేశమంటే మనుషులోయ్ అని
గంటకొట్టె మహాకవీంద్రుడు
మేలుకోవోయ్ భారతా !

రాష్ట్రిరాష్ట్రి దురాక్రమణలన్,
మతమతాంతర మత్సరములన్,
ప్రేమమయమగు విశ్వమానవ
గర్భమే గాయాలుపడెఁ.

దేశమంటే దిబ్బకాదోయ్ !
పంటపొలములు - పండ్లతోటలు
గోనదీ నిక్షేప నగములు
కాంచు మంగళదేవతోయ్.

మనుషులంటే మట్టిబొమ్మలు
కారుకారోయ్ - కర్మకాండల
కదనభూముల - కాకతీరిన
భారతుల మగ బిడ్డలోయ్.

మట్టియని నిర్మానుషంబని,
దూరతలమని తుస్కరింపకు,
మట్టికే ఆమడలు నెట్టుక
వచ్చె చీనా తండముల్

దేశబుణమును - దేవబుణమును
మాతృ బుణమును - మనిషి బుణమును
తీర్చగలిగిన దీక్షితుడనని
తెలిసి తెలిపే సమయమోయ్.

మానిసివిగా మసలవలెనో
బానిసవుగా బ్రదుకవలెనో
తేల్చుకో - తెగటార్చవలెనోయ్
దొంగ చైనా యెత్తులకా.

గాంధిదేవుడు కట్టిపోయిన,
వీరతోరము విప్పబోకోయ్,
ఎచట ధర్మమొ అచటె విజయము
మేలుకోవోయ్ భారతా!

గురుదేవ రవీంద్ర !

సంపదకు పుట్టిల్లు - సాహితికి నట్టిల్లు -
సంగీత సాహిత్య సాధనల పడకిల్లు -
నీ జన్మగృహము దేవేంద్ర ఋషిసంసదము—
నీముఖ సరస్వతికి కైమోడ్తు గురుదేవ!
నవయుగోదయ మహా
కవినాయక రవీంద్ర!
స్మరియింతు నీ చరిత
గురుదేవ రవీంద్ర!

వైశాఖచూత శాఖా శోభనంబుగా
అలవోకదిగె నొక్క అపరూపకోకిలము,
నాట్యవేదారణ్య నళినీసరస్సులం
దోలలాడిన దొక్క ఉపనిషత్ కలహంస,
గేయగాయన కళల్ కిలికించితములుగా
మేళవించిన దొక్క మృదులాంగుళికరంబు,
ఏపురాసుకృతమో
ఈ యుగము తనిసినది

నీ రాకచే - నీ వాకుచే
భువనకవికులచంద్ర
గురుదేవ రవీంద్ర !

పలుకలే వేనాడు పరుషములు లేలేత
చిగురాకు పెదవులకు సెగదాకి కమలునో !
చూడలే దేకడను చురచురలు సుడివోవ
మస్పృణావలోకనము మ్లానమై కమలునో !
లిఖియింప వేయెడను క్లిబ సౌందర్యములు
శిల్ప లక్ష్మీముఖము శిథిలమై చెదురునో !

ఎంతశుచిమంతమో !
ఎంతరుచికాంతమో !
తావకాత్మకళాను
భావనలు గురుదేవ !

రచియించి రెవ రపూర్వంబుగా సాహితీ
గర్భకోశ స్నిగ్ధకమనీయ కలరవము ?
చూపించి రెవరు చక్షుస్సుందరంబుగా
ప్రాణిచేతోరక్తభావసంచారములు ?
పాడి రెవ్వ రనంతభణితి మధుమయముగా
రాగిణీరాగ విభ్రమ కలాపార్థములు ?

ఏకముఖంబుగా
ఏనాడు వినలేదు !
కవిముఖ కుముదచంద్ర
గురుదేవ రవీంద్ర !

ఈ యబోధప్రకృతినెల్ల సంపూర్ణ సౌం
దర్య రంగంబుగా దరిసి దర్శించితివి
ఈ చరాచర జగత్ ప్రాచురీగతి గమక
మాత్మలీలామనోహరముగా వలచితివి
రంగులో-రేఖలో-రాగంబులో-దేవ
మానుషీబంధము సుమాళింప తీర్చితివి

సుకవిగా, స్నిగ్ధగా
యకుడుగా, చిత్రకా
రకుడుగా ఏలితివి

రసజగత్తు రవీంద్ర !
గురుదేవ ! సుకవీంద్ర !

మబ్బుల ముసుగులో మసలేటి చపలలకు
నవనాట్యభంగిమలు సవరింపగానేర్తు,
చండాలవాటిలో స్వచ్ఛమై వెలయగా
దేవతాతులసిన్ ప్రతిష్ఠింపగా గలవు,

వీరు కరఖడ్గమ్ము విరిగి జారినవేళ
ప్రేమకన్నుల వలల్ విసిరి వివశమొనర్తు,
ఉదయాస్తమయ సంధ్య లొడ్డాణముగ బిగియ
బ్రహ్మాండ కాలచారణభంగిమలు తీర్తు,
కలముతో-కంఠంబు
తో-కళాతూలితో-
విశ్వనందనమధుమ
దిందిందిర రవీంద్ర ।

★

ఓ కవీ!

అమృతపదోధస్సున హ్లో
దమరందము పిదికి త్రావి తనియించిరి భూ
తమయులగుచు ఆ శబ్ది
ద్యుమణుల కెత్తుము తెనుంగు దోసిళ్లు కవీ!

వ్రాయుము నుడువులు తీయము
మాయని భణితిన్ సమాజమానససరసీ
తోయము లద్దములుగ భవ
దీయకృతి లలాట రక్తతిలకము దిద్దన్.

మ్రోయింపుము కిన్నెర బిగి
పోయిన తంత్రుల సుతారముగ నతికి, పర
శ్రేయస్సంమితమగు నవ
గేయము పాడింపు; మాలకింపగ నెడదల్.

వ్రాయింపుము నడిపడుచుల
గాయములకు చందనమును, కష్టభరక్లే
శాయత్తములగు ఘటముల
పోయింపుము మురికిలేని పుణ్యోదకమున్.

భూషింపుము మైత్రీమృదు
భాషాచరణములు, కావ్యవరివస్యా పీ
యూషము చల్లుము ఘాతుక
దోషజ్వరతాపమునకు తొలకరి కొగఁ.

శరదంతర శశిశయ్యా
సురభిళ చంద్రిక విధాన శోభిల్లెడి మా
సరళాంధ్ర రమ్యరచనా
పరిణామస్వాదిమలను భావించు కవీ!

గుమ్మడిపూదేనెలు గొను
తుమ్మెదవలె, తెనుగు చెఱుకుతునకల పీయూ
షమ్మును చేకొని నింపుము
కమ్మని వాచాపటీరకలశముల కవీ!

బహుశోక బద్ధమగు కథ
విహితమనోరమనుచేసి వెలయింపుమనెఁ
ద్రుహిణుడు ప్రాచేతసుతో,
సహితోదరమేమొ కవివిషాదంబు కవీ!

★

క్షమధ్వమ్

ఓ యర్థానుస్వారవి
ధేయవచస్వి ! నవసాహితీద్వేషోపా
ధ్యాయ యశస్వి ! దోషా
ధ్యాయపరాయణ తపస్వి ! దండంబులివే.

పద్య ప్రవచన రచనా
విద్యా శ్రమశాలి వీవు, విశ్వాయతన
ప్రద్యోత సుందరశ్రుతి
మద్యపిపాసా పరవశమతి నేను కవీ !

చూపులు వాకులున్ కవియుచో గమనింతుము సంధిసంగతుల్
మాపుల రమ్యదృశ్యములు మారునెడన్ విరతుల్ గణింతు, మీ
రూపకళావతారముఖరోచిరుపాసన చూడజాల వే
పాపమె ? పక్షపాతపరిపాకమె ? శ్రోత్రియ మండలాగ్రణీ !

స్పష్టత లేదనియెద వీ
సృష్టిని విస్పష్టమయిన దేదోయి బుధా !
క్లిష్టావరణము చీలిచి
ఇష్టార్థఫలంబు వెదకరేమొ సహృదయుల్.

సువ్వీ యనుచును రోకలి
కవ్వించును సుకవి, కావ్యకంఠధ్వనిలో
మవ్వముగా తాకును దౌ
దవ్వుల రమ్యార్థ మిది సుతారము సుకవీ!

"శిరసుననిడు మందారము
చరణముల నలంకరించి చక్కదనంబుల్
చెరిపిన" దంటి - చిగుళ్లకా
చురికలతో కోతువెంత శుష్కహృదుడవో?

మందారకుసుమధారులు
బృందారకు లర్థి శిరసులిడి మ్రొక్కగ ఆ
కుందరదనల చరణములు
మందారమయంబులై సుమాళించె కవీ!

శ్రావణి పయోభిషేక
స్లావితగాన్ దాడిమీఫల స్తనము లస్రుక్
స్రావములై తడి కెంపుల
కోవలతో మెరయు నెవరికోసమొకొ కవీ!

చూపుల కందునె నవ తరు
ణీ పుష్పిత లలితకామనీయము లవి యే
వో పర్యాయపదంబుల—
రూపింపక లోక సుందరులలోన బుధా!

చవిచూడ వెన్నడును కను
గవ కందదు నీకు, అమృతకలశము లేదం
దువు - భావకవిత కంర మ
ధువుచే దందు - ఏది జిహ్వాదోషంబొ కవీ!

ఎరువడుగునయ్య రంగుల
బరిణలకయి తమలపాకుపచ్చని చెఱగుల్
మెఱుగుల ? కీ జగదంతరు
దరం బఖిల శోభలకు నిధానంబు కవీ!

పడతుక నెలబరు వెఱుగని
జడవల్లభున కనభిముఖసరణీ ధ్వనింపఁ
నడు మఱుపని యొడ్డాణము
మెడనిడె - కాంతానుభావమిష లివియె బుధా.

★

కృష్ణాష్టపది

స్మరియింతును ముట్నూరి మ
కరందకాసార ధీరకలహంసంబుఁ
సురసాల సాహితీ వై
ఖరీముఖర కృష్ణరాయ కలకంఠంబుఁ,
కనిపించు యుష్మదీష ద
భినేయ నీహారహాస విశదాస్యకలల్
వినిమిత బహుభావ నిమీ
లన కాలీన నయనాంచలంబుల నేడుఁ.
స్మృతితగులు, ధ్యానిబుద్ధ
ప్రతిమాముఖశాంతి యోగరత చిన్మహిమల్
శ్రుతిహితముగ తెలిపిన భవ
దతీత విజ్ఞాన సంహితాధ్యయనంబుల్

శివతాండవమందు సమ
స్త విశ్వచైతన్యరాగతాళము లేకాం
తవిరతి నయించు నంటివి ;
అవికల్ప సమాధిలోన ప్రాణము లట్టుల్.

నదియెండమావులకు ప
ల్లెడలు సవదరింపగల పటిష్ఠుడ, వెలపూ
మడులవలె కళాక్షేత్రపు
పడకల నీరెత్తు అమృతపాణివి కృష్ణా!

అజుసృష్టికంటె కవిత
ల్లజు శిల్పసృజన విలసదలంకృతమై ఆ
రజమగునంటివి, దువ్విన
నిజ కుంతలములు జడ రమణించెడి కరణిన్.

అతినమ్రము నీ వృత్త, మ
నతి ప్రగల్భ ప్రసాదనర్మము భవదు
న్నత వాగ్వృత్తి, సుదుర్లభ
మతీవ మీ యుభయమేళనాయతి కృష్ణా!

మ్రాకులలో కిన్నెరలను,
వాకులలో చిరమనస్తపఃపాకములన్,
వాకలలో శ్రుతులను, ఆ
లోకించితి వహో! రసప్రలుబ్ధ మనీషన్.

★

క్షేత్రయ స్తోత్రము

రామ ముఖారవింద
మకరందము తేటిచి పోనె త్యాగయ
స్వామి అనంత రాగ
కలళంబుల లోకము లాస్వాదింపగా,
కోమల కృష్ణ పాదముల
కుల్కిన మువ్వల మ్రోత క్షేత్రయ
స్వామి పదాలలో నినిచె
జానుతెనుంగులు పుల్కరింపగా.

మును మా యమ్మలు పాడిబానల పయి
ముత్యాలు చిందంగ చి
ల్కు నవోషస్సుల నే లయశ్రుతుల
భంగుల్ నృత్తరూపంబు లం
దెనొ, ఆ సుందర సంప్రదాయముల
నున్మీలించె సాహిత్య లా
లనతో క్షేత్రయ సాత్వికాభినయ
లీలా లక్షణా దక్షుడై.

మెఱుగు కుచ్చెళ్లు తుంపెసలాడగా త్రుళ్లి
నింగి తారలతోడ నృత్యమాడు,
సహజగతి గమకసంచారములు మీర
దక్షిణానిలుడు నర్తనము సలుపు,
జ్వాలమాలాహస్త చతుర చాలన లొప్ప
అగ్ని పతాకాదు లభినయించు,
లలిత తరంగ తల్పకములం దప్పరో
ముదితలు ఓలలాడుదురు మురిసి,
ఋతుచరణ చారణము లలంకృతులు గాగ
తరు లతాలాస్య శిక్షణ జరుపు ధాత్రి,
నాట్యమే పంచభూత సంధాన లీల
కుపనిష త్స్నాత్రమనుచు చేయుదును స్తవము.

నిఖిల పుణ్యాంగనా ముఖ మండలంబుల
నర్తించు సోముని నవ్వు కళలు,
సకల చైతన్య మస్తకము లెక్కి కిరీటి
కనక కుంభాభిషేకము నటించు,
స్థూల సూక్ష్మేంద్రియావాల చక్రంబులఁ
తాకి నాదబ్రహ్మ తాండవించు,
యావ దంగోపాంగ జీవతంత్రులు తీర్చి
నాట్య వేదాభ్యసనము నయించు,

రమ్యమైన యీ బ్రహ్మాండ రంగమందు
ప్రకృతి పురుషుల విప్రలంభ ప్రకీర్ణ
భాగవతమె ప్రవర్తిల్లు పగలు రేలు ;
నాయికానాయకుల అభినయము నదియె.

చిదచిత్ కల్పితమైన చిత్ర జగతిఁ
స్త్రీపుంస యోగంబునఁ
సదసత్ సాధన లాకళించి, హృదధి
ష్ఠానంబు - తాదాత్మ్య సం
విదవేషఁ గొన నాట్యరూపమున
నేర్పెఁ క్షేత్రయస్వామి ; యీ
పదబంధాభినయంబు గోపికలు
గోపాలుం డుపాసింపగఁ.

త్యాగయస్వామి

ఎందరో మహిమానుభావులు
అందరికి నా వందనము లివె-
అమృతనాదోపాసకులకుఁ
గాయనీ గాయనులకుఁ.

'నిను వినా గతి యెవరు నా' కని
అవితథ ప్రతిపత్తితో శ్రీ
'రామ నీదు సమాన మెవరని'
అడిగె నెవడు ముఖాముఖిఁ.

'ఎవరితో మొరలిడుదు' నని తాం
బూర మీటుచు రామభక్తి
బ్రహ్మ సామ్రాజ్యమున నిలిచిన
స్వామికి నమోవాకముల్.

బ్రహ్మ మానసపుత్ర నారద
నాద సరసీరుహా మరందము
త్రావితివొ మా తెనుగు సరసుల
చల్లగా వాకిండ్లలో-

నీదు నగుమో మరయజాలని
నాదు భాగ్య మదెంత యని, శ్రుతి
దారిచూపగ స్వర విహాయస
పథము పట్టితొ దీక్షతో.

అందరాని అనంతనాదము
నందుకొని- సాహిత్య ముఖమున
రాగరూప మనోజ్ఞముగ అం
దించితివి సుఖదాతవై.

సౌఖ్య మెక్కడ శాంతి లేకని
వెదకి వేసరి, రామచంద్రుని
అడుగవే సీతమ్మ యంటివి
ఎంత దగ్గరివాడవో.

★

మహాకవి పోతన

సముడై యెవ్వడు జీవనోత్సవ
రహస్యంబుఁ గవేషించి కాం
చి, మహానందముతోడ భాగవత
వంశిఁ వంచి వాయింప, వృ
షములున్ తన్మయతఁ ప్రతిధ్వనుల
లాస్యంబాడె, నా సాహితీ
ప్రమదుఁ మ్రొక్కెద పోతనార్యుని
వచో రమ్యవ్రతాచార్యునిఁ.

నెమరుల్ వేయక, మేతమేయక, చెవుల్
నిక్కించి, నిస్తంద్ర నే
త్రములై, మోరలుసాచి, వేణుముఖ
గాంధర్వంబు నాలించు ధే
నుమతల్లీ ప్రతిమల్ మలంచితివి
తెన్గుంజాజి పూదోటలో;
అమృతఖ్యాతు స్మరింతు నిఁ సహజ
విద్యాకేతనుఁ పోతనఁ.

చేతుల తాళముల్ మొరయ
చిక్కులువార శిఖోపవీతముల్
చేతము రామకీర్తన రుచిక్
చెమరింపగ, తన్మయస్థితిక్
పాతరలాడుచుక్ తెనుగు
భాగవతంబును పాడినాడవో
పోతన సత్కవీ అమృతముల్
కురియన్ నిజవాక్పయోదముల్.

పాకాల పాల తటాకంబు కెరటాల
మీది మీగడతేట మేళవించి,
రామప్పగుళ్ళలో రవళించు ఓంకార
శబ్దానురణనమ్ము సంతరించి,
వేయికంబాల కోవెల మంటపముఖాన
శిల్ప సౌందర్యంబు చిత్తగించి,
ఓరుగల్లు పసిండి ద్వారబంధాలపై
నిలుచున్న హంసల నేస్తగించి,
తావకీన వాఙ్మయ తపోధారణంబు
స్నిగ్ధమై మాధురీయోగ ముగ్ధమయ్యె,
కాక వశమౌనె? గాంగవీచీకలాప
భారధారానుగతమైన భాగవతము.

అత్యకలంకభ క్తి
వినయాంజలిబట్టి నుతింతు పోతనా
మాత్యుని, రామమంత్ర
మహిమాబహుమాన ఫలప్రపూర్ణ పాం
డిత్యుని, వ్యాసవాగమృత
నిర్ఝరిణీ భ్రమణానువాదలా
లిత్యుని, సాధుకృత్యు,
నమలీకృత భాగవతాభిజాత్యునిఁ.

నల్లని మేనివాడు,
చరణంబుల గజ్జెలు మ్రోగువాడు, జా
బిల్లి మొగంబువాడు,
చిఱువెన్నెల కన్నుల చిందువాడు, వ్రే
పల్లెనెలంతులఁ కలిసి
పాటల నాటల సోలువాడు, భా
సిల్లును నాయెడంద,
నతసీ తులసీ వనమాల లాడగన్.

మంగళ మాఘమ్

ఆముఖం

మధువునకు లేమావి- మల్లెను
వేసవికి- వృష్టికి కదంబము-
తమ్మి శరదకు- సీతు శిశిరున-
కిచ్చితివె హేమంతమా !

వసంతం

కోయిలలు రాగాలు తీయగ,
పువ్వులను మురిపింప తుమ్మెద,
కన్నె లతలు సమ్మర్దలాడగ,
చైత్రు డేగెను సుఖముగా.

గ్రీష్మం

రావి బంగారాకు లొత్తగ,
పగలబడి నవ్వంగ మాగధి,
చందనార్చన సలుపవిరహిణి,
దీర్ఘ వాసరములు చనెకా.

తొలకరి

కొప్పు కందని కురుల పోలిక,
వెదల బెదిరిన పెయ్యలట్టుల,
కొదమ మబ్బులు పొదివికొన - పుల
కించె లోకము తొలకరిఁ.

వానలు

ముసురు ధారలు ముంచ సొనలను
నీరు పారెను నిర్ఝరముగా ;
ఈన మోసిన ధేనువుల వలె
కనుల తనిపె తటాకముల్.

జున్నుగడ్డల భంగి చుక్కల -
వెన్నెలను పెరుగన్న మట్టుల -
మ్రింగె దయ్యము వంటి చీకటి
జడలు విడ మిట్టాడుచుఁ.

మరిచిపోయిన ఉపనిషత్తులు
స్మృతికిరా మండూకవర్గము
గొంతు విప్పి జలాశయంబుల
వల్లె చెప్పె నహర్నిశల్.

తోట కంచెల త్రోవ వంచల -
నదుల సందిట, పొదల ముందట -

ముచ్చటగ నెల లచ్చి కెత్తిన
పచ్చి పంది క్లగపడెఁ.

పైరు మొలిచిన చేలు- చెరువుల
నిండి పొరలు జలాలు - చేపిన -
ఆల పొదుగుల పాలు - చక్కఁద
నాలు చల్లెను పల్లెలఁ.

శరత్
ఏటి జలములు తేట తేఱెను
బాట లెండెను- పచ్చ గేదగి
చెండ్లు మోసెను- పసులు మేసెను
లేత పచ్చిక బీళ్లలో.

స్నానమాడిన చాన లట నట
నీళ్లు పిండి బయళ్ళ పరిచిన
చీరెలన తెలుపారి మబ్బులు
తేలియాడెను మిన్ననఁ.

మంచి గుమ్మడి పూలు బంగరు
కంచముల వలె మించె గనిమల,
రేయి చుక్కల చాయ కన్నది
దోస తీయని పిందెలఁ.

హేమంతం

పాలుపోసిన పైరు పొట్టల
చేలు శ్యామల మాంసలములై
ఈడు వచ్చిన పడుచులాయెను
సీతుసావాసంబునన్.

పుష్యమీ చంద్రుల సమాగమ
భోగమునకై పుచ్చపువ్వుల
పాన్పు లమరెను బట్టబయలున
విభ్రమంబులు పైకొనన్.

భోగినోములు నోచి నెలతలు
పాలపొంగలి పంచి వెళ్ళిరి
పసుపు కోకల పమిటలాడగ
పడకటిండ్లకు భ్రమయుచున్.

మెరపతోటలు మెరిసినవి పగ
డాల బోలిన పండ్లగుత్తుల,
బంతి మొక్కల చాళ్ళు గొబ్బికి
పసుపు ముద్దలు పెట్టగాఁ.

ఎండలకు తపియించి, వానకు
తడిసి నిలిచిన తరులకొమ్మల
ఆకునాకున నిండినవి హే
మంత ముక్తాగుచ్ఛముల్.

మాఘమ్

వచ్చినావే మాఘమా ! శ్లో
ఘూవివీత పయోధరోఘమ !
ప్రత్యుషస్స్నాన వ్రతచ్యుత
భక్తజనతాపాఘమా !

శీతఋక్ల నిశీధమందున
శౌరి నిద్దుర లేవగా - నై
కుంఠమున వాకిండ్లు తీయగ
వచ్చినావే మాఘమా !

విరహమున బడి వేగజాలని
గోపికలు కాత్యాయనీ వ్రత
మాచరించుట కనువుగా - వేం
చేసితివె శుభదూతివై.

వెలగపండ్ల విపక్వగంధము
బదరిఫలముల మద సువాసన
తీపి పులుపులు తిరుగబోసిన
కమ్మదనములు గుప్పెడిన్.

నల్లబడిన నిజచ్ఛదాంబర
ధారణాతివికారమున నిను
చూడసిగ్గిలు లతల నగ్నల
జేసి చూతువె మాఘమా !

మహారాజశ్రీ
రాష్ట్రపతి
శ్రీ రాధాకృష్ణ మహోదయులకు

శుభకృత్ వత్సర ముఖమున
ప్రభు పట్టము కట్టి, రాష్ట్రపతి పదవిని ని
న్నభిషేకింతురు- భరత సు
రభి పొదుగున పాలు చేపె రాధాకృష్ణా!

నీ ముఖ సరస్వతికి
నీ మతి బృహస్పతికి
నీ యోగ భగవతికి
నిత్య జయమంగళము.

నీ రచన మేరువయి
నీ వాణి గీతమయి
విబుధ చక్రము నావ
హించె, రాధాకృష్ణ!

చిద్విభూయిష్ఠమగు
ఈ సృష్టిలో లయ
ప్రళయార్థము లమృత వి
షాలొ, రాధాకృష్ణ!

గానమున లయ నిలిపి,
ప్రళయమును పరమాణు
గర్భమందున దాచె
ప్రకృతి- రాధాకృష్ణ!

పదమట ప్రబుద్ధులా
పరమాణువును కొట్టి
కాళియాహిని లేపి
నారు- రాధాకృష్ణ!

నీవు కృష్ణుడవు ఈ
లోకంబె గోకులము
అభయ తాండవ మాడ
వలదొ- రాధాకృష్ణ!

ఆనందవల్లివయి
అమృతంబు చల్లు మిక
ఆపద్దవాగ్ని చ
ల్లార- రాధాకృష్ణ!

కర్మమే బ్రహ్మమని
జ్ఞానమే బ్రహ్మమని
నారు- బ్రహ్మము ప్రేమ
కాదొ- రాధాకృష్ణ!

హృదయ దేవత రాధ
జీవేశ్వరుడు కృష్ణు
డనవగీతం బాయె
రాధాకృష్ణ గీత

నీ ధ్యాన ధారణకు
నీ యోగ సాధనకు
శతశతాయుఃస్ఫూర్తి
అగును రాధాకృష్ణ!

అభినవ విద్యారణ్యుడ
వుభయ ప్రజ్ఞానదీప్త సూక్తిని, అర్పిం
తు భవన్మూర్తికి, ఈ సు
ప్రభాత మంగల్య మాల- రాధాకృష్ణా!

★

మన్మథావాహన

ఉగాది ప్రొద్దుల ఉత్సవములలో
మనోరథంబులు మధుపథ మంటగ
ప్రియంబుగా నిను పిల్తుము రావోయ్
నవీన వత్సరనాథ ! మన్మథా !

సర స్తరంగములు చలువపాన్పులుగ
ఉయాలలూగే ఒయారి తమ్మిల
మిళిందకన్యలు మేలుకొల్పెదరు
ఉషస్సు మంగళ కషాయకాకలి.

రసాలపల్లవ రక్తగుచ్ఛములు
పిసాళివలపులు దెసలను విసరగ
తపించు పికముల తప్తకంఠములు
ద్రవించి తీపుల తిక్కలెత్తగా.

శిరీషశాఖల చెంప సరులుగా
అలంకరించెను అలరు జొంపములు,
చెలంగె చిటిజాజులు వనీనటీ
పదాల కులికెడి వెన్నమువ్వలై.

ప్రసన్నరసమయ పర్వపరాయణ
భరాలసంబయి సరళ సరళముగ ;
వినంగ నాయెను విమల శుకశ్రుతి
అశోక సుమనోహరమైన మహిళా.

★

ఉగాది

మంగళంబోయ్ మన్మథా! జయ
మంగళంబోయ్ మన్మథా! నవ
వత్సరాది మహోత్సవార్పిత
వాద్యగీతా స్వరసుధా।
మంగళంబోయ్ మన్మథా! జయమంగళంబోయ్!

ఎన్ని యేండ్లో నడిచినవి మా
యింటిలో నీ వాడికూడీ
పక్వకదళీ గోస్తనీఫల
పాయసము భుజియించీ, మంగళంబోయ్!

నీదు తరుణ స్నేహవిరహము
నిలుపరాని దురాతపంబున
దిగులుపడి చెడి సొగసుమానెను
తీగెలును పూలును వగఁ, మంగళంబోయ్!

రామశబ్దము వల్లెచెప్పదు
దోరపండ్లను తేరిచూడదు
ఋకఋకీవలయంబు తావక
సుభగచోదన పొందమిఁ, మంగళంబోయ్!

మెఱుగుకాడలు లోలకులవలె
మిసిమి తళతళలాడి వ్రేలగ
మురిసి వేచెడు దిరిసెనలు నీ
దరిసెనమునకు తాలిమిఁ, మంగళంబోయ్!

కోకిలలు తినకుండ తోటల
గున్నమావి చిగుళ్ళగుత్తులు
కాచినారము కమ్మదనములు
కదలలేదు రవంతయుఁ, మంగళంబోయ్!

పూలతేనెలు గ్రోలకుండగ
తోలితిమి తుమ్మెదల వేకువ
నేలపైపడనీక పమిఁ బెల
పట్టినారముపొగడలఁ, మంగళంబోయ్!

జిన్నికట్టిన జాతిచెరుకుల
వెన్ను వేయని కండకన్నులు
ఏరిదాచితి మిష్టమంచును
ఆరగింపుము అతిధివై!

మంగళంబోయ్ మన్మథా!
జయమంగళంబోయ్ మన్మథా!

★

పెండ్లిలగ్నం

1

వెండిలాంతరు వెలిగించి వెడలె రజని -
ఒడలు తెలియక నిదురించుచున్న జీవ
కోటి నరసి కాపాడ - పక్షులను బోలె
చెట్లునున్ కదలవు సొమ్మసిలిన యట్లు.

చలి ముదరలేదుగాని, వానలను తడిసి
చెమ్మగిల్లెను నాలుగు చెరగు లవని -
మీద కార్తిక జ్యోత్స్న ప్రామిన కతాన
రేలు శీతము లనిపించె కాలగతిని -

పండలేదు పునాసలు పాలుగూడ,
పొల్లుపోయెను వరిచేలు నీళ్లులేక,
ముదురు నేద్యము గడ్డితో ముగిసె ; వెనుక
చిక్కుపడ్డవి వానలు నేద్యమునకు -

చెరువు నిండిన దీ యేడు కరువురాదు,
మిరపతోటల కిందాక పురుగు లేదు,
అతికినవి పైరు లన్నియు నచ్చ టచట
సుంకు పోయుచున్నది మక్కజొన్న యపుడె.

పడ్డది విశాఖకార్తెలో వరిగె విత్తు
రాలితే క్రొత్త పాతళ్లు త్రవ్వవలెను -
పూతపట్టిన కొతిమేర పొలము చాలు
కార్తె కడల మంచానక కాసెనేని -

ఎదిగినది పిల్ల పెండ్లికి - ఎట్టులయిన
యెడ్ల కొట్ట మీయేడు నేయింపవలయు -
వానలకు కారిపోయిన పడమటింటి
గోడ కండ వేయకయున్న కొప్పు కూలు -

శిస్తుకోసము నిరుడు వ్రాసితిని నోటు
పెరిగె నది పాము పగవలె - పెయ్యదూడ
నమ్మి తీర్చెద మన్న ప్రాణమ్ముకాదు -
మేపుకొన్నారు పిల్లలు తీపితోడ -

వెల్లవన్నెలో చనుకట్టు పిరుదు సొగసు
కుదిరి—కొమ్మువాటము గల గోవు దొరక -
దెందు కొక మగదూడ జనింపరాదు !
గోవు మాణిక్య మన్నారు కులమువారు.

అనుచు తలపోయుచుండె 'రామన్న' - చుక్క
పొడిచి బారె డెక్కె - ఇరుగు పొరుగులందు
చల్ల చిలుకు చప్పుళ్లు - కావళ్ళ మ్రోత
లును కలిసి చెల్లుమీది పక్షులను లేపె.

పసుల మేతల సవరింపు - పాడిగొడ్ల
కుదితికోసము విడుచు సందడి, అరకలు
కట్టు రభసములును చెలంగె - కాడిక్రింద
రాక మార్మ్రసలెడి కోడె రంకె లడర.

2

పేరు భూదేవి రామన్న పెండ్లియాడి
ఇరువదేండ్లాయె - ఇల్లాలు ఇల్లు దిద్దె
నేర్పుతో వెల్తి బయట రానీక - కడుపు
పండె దోసపాదు విధాన నిండె గృహము.

బిక్కపలచని నెమ్మేను పచ్చి పసుపు
కొమ్మువలె మంగళచ్ఛాయ క్రుమ్మరింప -
ఇంతలేసి కాటుకకండ్ల యింపుతోడ
మగువ ఆకలిదప్పులు మాయచేయు.

ఇల్లు మాయనీయ దిల్లాలు - మాయదు
కొప్పుగాని కట్టుకోకకాని -
అబల కబ్బె నిర్మలాభ్యాసములు - తన
నిర్మలాత్మ వృత్తి నీడలట్లు -

పడమటి పొలాని కేగి పాపటము తోలి
తిరిగివచ్చె రామన్న - ఎదురుగ పరుగు

లెత్తి కన్నులతో కౌగలించుకొనియె -
'నాగరత్తి' ఆయాస మంతయును జాఱ.

ముల్లుగట్టి చూరున దోపి - పిల్లిపెసర
పచ్చికను పెయ్యముందర వైచి నిమిరె
మూగముద్దులు పెట్టగా మోర నెత్తి -
కాపులకు పసిబిడ్డలు కావె పసులు.

కడవతో నీళ్ళుతోడి, ముక్కాలిపీట
వేసి, చాకింటిదోవతి తీసియుంచె;
భర్త కుపచారములు చేయ ప్రాలుమాల
దెంతపని యున్న భూదేవి యింటిలోన.

ఇంతలో వచ్చి రాతని యింటి - కూరి
పెద్ద కాపులు పెండ్లికి పిల్ల నడుగ -
బ్రాహ్మణుండు చెప్పినవేళ పాయకుండ -
గ్రామమునసబు వెంటరా గౌరవమున—

మనువునకు వచ్చినాము రామన్న యనుచు
మీస మొత్తుచు మునసబు మేలమాడె,
'రాండి రాండని' పంచలో రాట మెత్తి
మంచములు వాల్చి తెల్లకంబళిని పరిచి.

నిలువుచెంబులతో వేడినీళ్ళు తెచ్చె -
అనువు గనిపెట్టి భూదేవి అంతలోనె -
కిఱ్ఱుచెప్పులు విడచి...కాళ్ళకులు కడిగి
కూరుచుండిరి వారును కుశల మడిగి.

మాయమర్మా లెరుంగక, మంచి చెడ్డ
లాడుకొని రింతసేపు మర్యాదకొలది;
నేద్యముల నష్టకష్టాలు - చేలు చెట్లు -
పైరు పంటలు - పశువుల పాడికథలు.

అందఱికి భోజనంబు లాయత్తపరిచె
గడియలోపల భూదేవి - కామధేను
విచ్చినట్టు లిష్టాన్నము లింపితముగ -
ఇరుగు పొరుగులన్ తాలింపు పరిమళింప

తోడిన జలాల స్నానము లాడి కట్టి
విందుకుడిచిరి జిహ్వాలువ్విళ్ళు గొనగ
తెల్లగా తోమిపెట్టిన పళ్ళేములను
వరుసలాడుచు కూర్చున్న బంధుజనులు.

వడ్డనలు చేసె చవులూరు వంటకములు
క్రొత్త సొంపారుకారమున్ కొసరి కోర;
పైరవంకాయ తాలింపు - దోరవేపు
కందిపప్పు కమ్మదనాలు చిమ్ముచుండ.

ఇంటకాచిన కపురమువంటి నెయ్యి -
జిడ్డుమీగడ గట్టిన గడ్డపెరుగు -
చవులు తెలిసిన భూదేవి స్వాదుపాక -
మే పదార్థ మింపితముగా దెవరికేని -

పంచలో కొన్ని—నిండారు బయల కొన్ని
అంచుదుప్పట్లు పరిచిన మంచములను
వేసిరి సుఖాన నందఱు విశ్రమింప -
పుచ్చపుపువలె వెన్నెల విచ్చివిరియ.

ఇంతలో వేడుకలు విన నిరుగుపొరుగు
పేరటాండ్రును పెద్దలు చేరవారి -
రిల్లు సవరించి భూదేవి బిడ్డతోడ
వచ్చి కూర్చుండె రాటముప్రక్క నెలమి.

సాటివారలు నవ్వుచు సంబరమున
మేలమాడ, గోవిందనామాలు పాడి
కొనుచు రాటము త్రిప్పసాగెను శుభాంగి;
లచ్చి సౌభాగ్యచక్రము లాగినట్లు,

మనువు తెచ్చిన పెద్దలు—మాటలాడ
వచ్చినట్టి పెత్తనదా ర్లుభయజనులకు
నచ్చచెప్పి పెట్టిరి ప్రధానంబు నాడె,
పండు పసుపును శుభ మని బంధు లాడ.

రంగుచీరె -పదారు వరాల పసిడి—
ఉభయ గృహయోగ్యము లటంచు నొప్పి కొనిరి;
యు క్తమైన సమీప ముహూ ర్తమునకు
పెండ్లిలగ్నము జరిగెను పెద్ద లలర

★

సంక్రాంతి సంబరము

అయిదులక్షల అరువదేడులు
గడచిపోయెను కలియుగంబున;
పదియు తొమ్మిది వందలాయెను
ఇంచుమించు శతాబ్దమ్ము.

అరువదంచుల కాలచక్రము
తిరుగుచున్నది వరుసతప్పక
వాన కురియును పంట పండును
లోకవృత్తము నడువగా.

పాలుతీసిన పొదుగులట్టుల
వాలబడె సంక్రాంతి మబ్బులు,
మంచుపడు హేమంతరాత్రులు,
జతలు పాయవు పక్షులుగా.

బూజు దులిపిన పూరి యిండ్లును
వెల్ల వేసిన వీధి గోడలు
అలికి ముగ్గుల నిడిన యరుగులు
అందగించెను పల్లెలన్.

తెల్లవాఱగ మేలుకొలుపులు
పాడుచును హరిదాసు లాడగ
గొంతులెత్తు శకుంతములు ఆ
నందముగ సుతి కలుపుచున్.

సస్య కేసర కపిశ శోభల
చేలు పసుపాడిన విధంబున
చూడ కన్నుల వేడుకాయెను
భూమి గంధము చల్లగా.

మంచి గుమ్మడి పూలపశ్మెము
లెత్తె పూజకు ప్రొద్దుపొడుపులు
రేయి చుక్కలరీతి గన్నది
దోసపూవుల పిందెలఁ.

నవ్యధాన్య సువాసనలతో
పాలు నిండిన భాండములతో
ఇండ్లు సిరి ముంగిండ్లయిన ఈ
పచ్చి పండుగ సందెలన్.

కడుపునిండా కుడిచి హాయిగ
కంటినిండా నిదుర పోదురు
ఆలు బిడ్డలు జానపదు లీ
వెలితి తెలియని దినములన్.

తలకు తాకును తలపులేవో
మదిని కదుపును మనసులేవో
గతము రా దాగతము తెలియదు
నేటి శుభములె మనకగున్.

క్రొత్తబియ్యము క్రొత్త బెల్లము
ముద్దుపాలను పోసి కలిపీ
కేరుచును పొంగింత మీ దిన
పుణ్యకాలోదయములన్.

మంగళము సంక్రాంతి సామికి
మంగళము మా భోగి సానికి
మంగళము మన మాతృభూమికి
మంగళం బందఱికినీ.

ఉగాది*

కోశం బమ్మిలయట్లు చిత్తము
ప్రియోక్తుల్ దాల్చ; మంత్రోదయా
వేశజ్వాలలు భేదవాద కలనా
బీజంబులఁ కాల్చ, ధా
రాశోషంబడిపోక అంతర
మనిద్రాణంబుగా శోభిలన్
దేశోద్ధారక యోగముఁ నెరపు
డర్థిఁ సోదరీ సోదరుల్.

పరమవ్యోమమునఁ వెలుంగు అవి
కల్పజ్యోతి కానంద సుం
దరలీలాశయమైన ఈ ప్రకృతి
పూనన్ లేదె నానా భయం
కర భద్రంకర రూపముల్ మును
జగత్కళ్యాణ యోగార్థమై,
పురుషున్ చూడుడు వీరమాతలగుచున్
పుత్రాక్నతిన్ గేహినుల్.

---

* ప్రభవ

కేవల నిర్గుణభావమో ఈశ్వరు
నంశ కాదిమనిష్ఠయయిన ప్రకృతి-
సంహారసమయ రూషిరుషా ప్రచండ క
ల్లోల తాండవమున వ్రాలుకాళి-
సకల కళ్యాణలక్షణ పూర్ణగాత్రియై
తమ్ముల పుట్టిల్లు తనుపులక్ష్మి-
సంగీతసాహిత్య సామ్రాజ్యనేత్రియై
మగని వాకిండ్ల నేమరనివాణి-
సృష్టిచక్రము చక్కగా త్రిప్పుచున్న
ఆదిశక్తి అవస్థాంతరాకృతులుగ,
ధ్యానవీథి నధ్యయనించు డాంధ్రసతులు
వీరపుత్రోపలాలనాభీష్టరక్తి.

తన రాజ్యసీమానితంబముల్ దాటి వై
రుల పారదోలిన రుద్రమాంబ,
తన మనోదీపాగ్రమును గణిత స్నేహ
లహరి తేలిచిన లీలావతమ్మ,
బిరుదుపోటరి రాచబిడ్డలన్ బొమ్మల
చాయ నాడించిన నాయకమ్మ,
తన ప్రియస్వామి బాలునకు పోడిమి కర
వాల మొసగిన మాంచాల మగువ

తెనుగు దేవళముల దీపించుచున్నారు
మలగిపోక నిత్యకళల పగిది,
పీరవాసరముల నారాధనము సల్పు
దమ్మృత కీర్తియోగ మంది సతులు.

వైదికావరణ మర్యాదలు మెరయంగ
నన్నయ తీర్చిన నయచరితలు,
క్షాత్రవర్చసు పిక్కటిలంగ తిక్కన
మాంసగించిన అభిమానవతులు
వివిధ కోమలరేఖ లవఘళింపంగ శ్రీ
నాథు డాడించిన నాణెకత్తె,
లాంధ్రకళాజీవమందంబు లెగబోయ
సూరన మలిచిన సుభగమతులు,

పరుష సరళసంస్కార శోభలుచెలంగ
కళల రూపాలలో రూపకళల పొదలి
సాహితీచిత్రములను సాక్షాత్కరించు
ఆంధ్ర సాధ్వీమతల్లుల కంజలింతు.

★

నవరాత్రి

శ్రుతి నిధానము - స్వర నిధానము-
పలుకులకు చదువులకు సమధి
స్థానమగు బ్రాహ్మీమతల్లికి
విశ్వతోముఖ విజయముల్.

పలుకులాడి విపించి పాటకు
పరవశుండై బ్రహ్మదేవుడు
జీవ ఘట ఘటనా సమర్థుం
డమ్మె జగదుత్సవముగాన్.

ఆమె హస్తన్యస్త పుస్తక
మంది చదివె చతుర్ముఖంబుల,
సంహితలు - పద - జటలుగా - విడి
కలిసెగా అవతరణికన్.

జీవికిని జీవము ప్రధానము -
జీవమునకును శబ్దమునకును
సంధిచి సామాన్య ధర్మము -
రెండు గూడ నదిస్పష్టమున్.

సకల హృదయంగమ రస ధ్వని
పదము సాహితియయ్యె కవులకు;
గాయకులకు అనంతనాదము
బ్రహ్మమయ్యె నుపాసనన్.

కావ్య కన్యా కోమలికములన్
రక్తశాల రసాల సాల కి
సాలముల దర్శించె శ్రీ పో
తన వచస్సు తపస్సుగా.

బండ కొయ్యను బద్ద శ్రీనా
ధుని యురస్సును కొల్చి ఎండను
పొగడ పూదండనె - రసోపా
సనల వాల్లభ్యం బహో!

తరుణీ వలపును తగుల బెట్టిన
కర్మ్మరుని గని కర్మసాక్షియె
రోష భీషణు డయ్యెననె కవి;
-సృష్టి ప్రేమమయంబుగాన్.

లలిత లవలీ లతిక మేనక
వలచెనట వృద్ధాచలంబును,
సాగె సుఖ సంసారమును - వా
రయిరి జనకులు గారికి.

నీల గిరులను బట్టి బయలున
పెరుగు ముద్దలు పంచు శారద
కవి కులంబుల కామెతలుగా
అందుకొను డీరు సందెలన్.

పూవులన్నీ కావు కాయలు
కలదు అనుభూతిని విభేదము;
ఒకటి ప్రాకృత - మొకటి సంస్కృత
ముభయమును పరమార్థముల్.

శిశువులను పశువులను రాగ వి
రాగులను వివశీకరించును
తేనెవలె గానము ప్రసన్నత
రంగముఖ సుఖ లాలనన్.

భావుకులకును సహృదయులకును
కవిత, బ్రహ్మానంద కావ్య
క్రతు ఫలార్ధ హవిస్సు వంటిది;
సాధ్యమగు ననుశీలనన్.

లలిత లలితారాధనా వ్రత
పాత్ర మీ నవరాత్రి - కట్టుము
కంకణమును మనః క్రియావా
చావిశుద్ధికి దీక్షతోన్.

విజయ దశమి

I

హే ! విజయదశమీ ! నమో
హే ! భారత శమీ ! నమో

ఆలింపుమీ శ్రీమదంధ్ర బాంధవ గీతి
అందుకొనుమీ స్వతంతాంధ్ర జనముల ప్రీతి ॥హే॥

మా తెలంగాణమ్మ మంగళారతు లెత్త
ముక్కోటి దోసిళ్లు ముత్యాలు చల్లేను ! ॥హే॥

పిండి విడిచిన ఆలపిండు వలె నలనోక
తెల్లమబ్బులు నడచు నల్ల మైదానమున ॥హే॥

నవ ధాన్యములు పండినవి గింజ కుంచముగ
క్షామదేవత ఘోర జాతరలు ముగిసినవి ॥హే॥

ప్రాతగిల్లిన పల్లె పాటలును ఆటలును
నగర వీథుల కెక్కి నవనాట్యములు సల్పు ॥హే॥

II

ఈ క్షేమ దీక్షలో - ఈ భార తరుణమున
శకుని ఖల మంత్రమా ? శల్య సారథ్యమా ? ॥హే॥

తాళ్లచనుబాలకై దండాట లాడేరు
ధరలు పడుతున్నవని తత్తరల దొర్లేరు,
యజమాని నష్టమట- పనివాడి కష్టమట
నష్టకష్ట వివాద నలిగేను దేశంబు,

ఇంటిలో కుచ్చితము ఇరుగు పొరుగుల పోరు
దూర సీమల యీసు జారు బురద పథంబు,

III

వావి వరసలు విరిచి కావాలె పెండ్లిండ్లు
హద్దు సుద్దులు దాటి ఆడవలె లేకర్లు,

ప్రజలలో త్రొక్కిళ్లు పార్టీల త్రోపిళ్లు
నాయకుల పెనుముళ్లు నట్టింట కడగండ్లు,
ఏడాది నిండలే దీ రాష్ట్ర వత్సమును
మెడపట్టి పెడలాగి పొడిచి పాలార్తురే!

IV

ఆంధ్ర కళ్యాణోత్స వాది నవరాత్రు లివి
కట్టవే మా కొక్క కంకణమె అందరికి
యావదాంధ్రుల పాడు యాలు పిండిన పాలు
ఏకగ్రీవము సంది సాక్షమై పొంగాలె ॥హే॥

★

ఆషాఢి

ఉపళమించె నిదాఘతపనలు
చేరవచ్చెను సాగి 'తొలకరి'
మేఘదూతికపోల్క ఛాయా
ఛత్రములతో ధాత్రికిన్.

జ్ఞాపనా సోపానములపయి
ఎక్కి జాఱుచునుండె చిత్తము
గుబురుకొమ్మలనడుమ చిక్కిన
చిలుకవలె చిట్టాడుచున్.

మెఱసె మాత్మమహీమతల్లి
కీర్తిగాధానర్తనోత్సవ
చారుచేష్టాచలనచాలన
లభినవములై క్రమ్మజిన్.

తుహినముక్తాసరులతో కొం
డంత కబరీభరము శోభిల -
దిరెవెలుగులు సాగరమురై
బాలు దీపిరూపమున్.

మాతృధాత్రి - అలభ్యవస్తు స
మృద్ధ నిధి నిక్షేపగాత్రి - స
మ సలోకాలోక కామ స
త్రి - కంజలి పట్టెదఁ.

మ్రోయుచుండె విహాయస శ్రుతి
దిగ్దిగంతర పర్వత నదీ
నద చరాచర కంఠముల భా
రత మహోదయ గీతమే.

వేదసంహిత - లుపనిషత్తులు -
బ్రహ్మవిద్యాయోగశాస్త్రము -
లిహపరోపాసనలు - ఏక
స్థాయి గొనె నా గీతిలోఁ.

లేచి పడు సామ్రాజ్యములు - పో
రాడి తెగు వీరాధివీరులు -
పెరిగి విరుగు కుబేరు - లందరు
అరిగెదఱు ఒక త్రోవనే.

యజ్ఞములలో హింస మరిగిరి,
క్షాత్రరతి జయదాహ మెక్కెను,
స్వార్థతృష్ణ కుకూల మట్టుల
రాజుచుండెను లోపలన్.

పరము వెనుకై ఇహము పైకొన
తన్నుకొనె సంశయఘనాఘన
ఘటనమున మనుష్యవృత్తము -
బురదబడ్డ గజం బటుల్.

జాతులును ఆచారములు సం
కరములయిపో, లోకసంగ్రహా
శాలియై సవరించుకొనెను స
మాజ మెప్పటి కప్పుడే.

ధర్మతంతులు తడిపి సడలిచి
పెంచివేసిరి నీతిమోకులు -
రాజులును రాచరికములు శా
సకములై ధర్షింపగాన్.

ఇంట మమతన్ బయట భీతిఁ
మానవుని వ్యక్తిస్వతంత్రము
అల్లఅల్లన కారిపోయెను,
చిల్లికుండజలా లటుల్.

దేశకాలాధీనమయి సా
మాజికాశయ భారబలమున
పాతగిలి బిగి పిగిలి మార్పడె
పూర్వ లక్షణ లక్ష్యముల్.

భిన్న భాషలు - భిన్న మతములు -
భిన్న రాజ్యాంగములు లోకుల
జాతులుగ విభజింప, దేశ వి
దేశభేదము లేర్పడెఁ.

స్వార్థ దుర్భర లుబ్ధరతి అ
న్యార్జితంబుల కాసపడె జా
తులును జనములు - దొంగతనమును
దొరతనంబును జతపడఁ.

అక్షియము చైతన్యరాశి - త
దక్షరము మానుషసువృత్తము;
ఏతదమృత ప్రణయయోగ
వ్యంజనయె సాహిత్యమౌ.

తీయమామిడిపండ్ల కమ్మని
కండగుజ్జును రక్తరసమును
జిహ్వాకందును, అందునా అను
భూతి విసరు సువాసనల్.

చదువవచ్చును చెప్పవచ్చును
శాస్త్రములు నియతార్థమితములు;
కఠినములు కావ్యములు ఆ స్వా
ద్యములు హృదయము కావలెన్.

కలదుగా ఱింద్రియసముచ్చయ
కేంద్ర పేశల పేశి, అది కా
వ్య ధ్వనిఁ ద్రవియించి సుకుమా
రముగా రసమయమగుఁ.

సహృదయులకును-సాహితీ చర
ణానుశీలనరతులకున్-ఆ
స్వాద్య మీ రససిద్ధి బ్రహ్మా
నంద బృందావనమునఁ.

ప్రజల పలుకులు భాషలాయెను;
భాష్య భాషణ భణితి పంక్తుల
పులకలొ త్తెను ప్రాణులకు నిజ
ఖేద మోద స్ఫురణలఁ.

నవ్వు కిలకిల-ఏడ్చు వలవల-
కరగు వగతో-కవియు పగతో-
సుముఖుడగు-ప్రత్యఙ్ముఖుండగు
నరుడు పలుకుల తగులునఁ.

ప్రకృతి తానై-తా ప్రకృతిగాఁ
పెకలె ఋషికంఠమున స్వరములు;
లోకమున శ్రుతులగుచు నిలిచె అ
నాది ప్రత్యుషభావనల్.

పూజల కుపాసనల-కాత్మ గ
వేషణలకును బీజబంధము
లాయెనవి; బహుజన నిషేవ్యము
లేల వానిని కాదన్.

అనుదిన వ్యవహారముల-క
ధ్యాత్మతత్వ విచారములకును-
శబ్దమొకటె శరణ్యమాయెను
చిదచిదర సమరమె
ధి థిల్

జీవులకు చేతనములకు అం
తరము కనబడు-తరులు ముదిసియు -
ప్రకృతి ఋతుధర్మానుగుణముగ -
పల్లవించెడి పచ్చగా.

జీవజాతుల మిగుల దీ ర్ఘ
శవజరాదులు తాకజాలని
శశ్వదవికల్పప్రకాశము-
కర్మ బలవద్ఘటనన్.

మానవుడు నశియించు-మానవ
సృష్ట వాఙ్మయము నశియింపదు-
దైవమానవ కర్మల కుపా
దాన పర్యయ మెట్టులో.

కాళిదాసుని కంరమా గెను
ఆతని 'అనాఘ్రాతపుష్పము'
నిలిచియున్నది నిత్య సౌరభ
నవనవోన్మేషంబుగా.

నశ్వరంబగు జగతి శబ్ది మ
నశ్వరాలంబముగ సమకొనె,
మంత్రముఖులగు వైదికులకును
పద్యసఖులగు కవులకుఁ.

సృష్టి శివమయమగుట సుందర
మాయె నేతదుపాధి ; మానవ
జీవితము మంగళము మంగ
ల్యమును కారాదెందుకో.

కావున మహాకవు లుపాసిం
చిరి 'శివేతర విరహితంబగు
వ్యంజకోక్తిని, లోకమందు' సు
ఖము రాగానుశయిగాఁ.

విప్లవము-లుత్పాతములు-మా
రీ భయారిష్ట కష్టము
లీతి బాధలు గాలివానలు
బాదియుం దీ లోకముఁ.

కాని, కోకిల పాడుచున్నది
పూచుచున్నది తీగె-కదలవు
నగము-లింకవు నదులు-నరుడును
సాగు ముందే చూచుచుఁ.

II

అన్నదమ్ములు పోయిరని ప
ట్టాభిషిక్తుడు కాడె ధర్మజు ?
డాకురాలిన క్రమాకులకు చిగు
రాకు లొత్తవె క్రమ్మరఁ.

విత్తు నశియించి మొలకాయెను
పెరిగి పూచి పలించి విత్తన
మిచ్చుటకె; యిది సృష్టినైజము
ఆదిబీజము రాదెటుఁ.

మనుజు డీ బ్రహ్మాండమూల ర
హస్య మెఱిగి శ్రమించె-బుద్ధికి
పదనుబెట్టి, స్వకర్మలను కౌ
శలముతో సాధింపగా.

గతమునకు చింతించు చాలా
దీపమార్పి జడీభవించెనె ?

వర్తమాన భవిష్య నిస్పృహా
శూన్యుడై నరుడెన్నడేన్.

పూర్వ సంభృతి పోయెనని వా
పోవనేటికి? పోయె నేమిటి?
భూమి నినికిన జలము జెలలై
నిలిచె నూతుల తోడగాన్.

భూతమునకే మొలక ప్రకృతము-
వర్తమానపు పూత భావియు-
పూచి కాచి ఫలించి సృష్టి ర
సీభవించి కృతార్థమౌ.

ధర్మ కర్మాచరణ రీతులు
తారుమారాయెనని వగతుము,
సోమపానము మాని పూర్వులు
ఉపనిషత్తుల నెత్తరే?

ఆస్తికులకును నాస్తికులకును,
పూర్వులకును నవీనులకును, వి
వాద మేటికి! ఏయి పాఅక
నావ లెక్కడ నడిచెడిన్.

కొడి క్రిందికి రాని కోడెలు
యువకులకు అది అప్పగింతము,

చేయ రెందుకు సేద్య మఖిలా
ర్ధముల కగు తమ భూములన్.

III

శబ్దములె ఈశ్వర నిరీశ్వర
చిదచిదర్ధ వివక్ష కాయెను;
తథ్యమవి మానవుని తలపులు
తెలుపు ధ్వని సంకేతముల్.

ఆరిపోవును చుంబనము వలె
శబ్ద మెప్పటి కప్పుడే; స్పృశి
యించు తత్తదబోధ తరళ
స్పంద మంతఃకరణము

లౌకికాలౌకికములు శ
రీర శారీరకముల కొక్కటి
చాలిచాలదు బ్రహ్మమెట్టు, అ
ఖండమయ్యను శబ్దము

కనుకనే వాచామగోచర
మనిరి అపరోక్షానుభూతిని;
వదలు డది నిస్సంగులకు—ఏ
టికి గృహస్థులు తడవగ,

IV

సృష్టి శిఖదళ వలెనె ముకుళా
వస్థ నుండెను నరుని బుద్ధియు ;
వర్ధమానముగాఁ ప్రకృతి, వికసించె నతని మనీషయుఁ.

కాపురము కారడవి- పురుషార్థములు పాపార్థములు- లోకము
మిథ్యగా భాసింపటోలు, తదవ్యవస్థిత మగు దశఁ.

స్పందమందిన జల తరంగము
ఉత్తరోత్తర వలయ వళులై
చెరువు నీటి కొలంది క్రమముగ
విరియదే సీమాంతముఁ.

కదలుచును కనబడని పవనము-
కనబడీ కనబడని అనిలము-
దృష్టమయ్యు నదృశ్యమగు జల-
మాశ్రయించెను పృథివినే.

V

ఈ మహత్తర ప్రకృతు లవిభా
జ్యముగ మేళనమాయె జీవుల ;

కర్మ కరణ కుశలుడయి నగుం
డధిగమించెను భూతలిఁ.

మట్టి శిలగా గట్టిపడి రా
శీకృతమయిన శైలవర్గము,
ధూళియై సుడిగాలి కెగురదు
ప్రకృతి యిందుకు సాక్ష్యమౌ.

బురద కడుపున మురిగి, నీటను
నాని, నాచు పెనబడ, పెకలి హ
సించు పద్మము భ్రష్టమయ్యును
కొండ గోగయి పుట్టునే?

మేరుశిఖము మీది కెగిరి ని
వాసముండిన వాయసము బం
గారు తెక్కల హంసగా పరి
ణామమందుట సాధ్యమే?

ఎంత సంకర మాయెనేనియు
ఇనుము కాదపరంజిఖండము;
మానవుడు క్రిమి కీటకము కా
బోడు క్రమ్మిలి దుర్గతిన్.

స్థూల సూక్ష్మ నిసర్గ వర్గ వి
భేదములు పరిణామబలమా

త్రమున మాఅవు; బొగ్గు రత్నం
బాయె పువ్వయి పూచెనే ?
ఈశ్వరున కుపసర్జనీకృతు
డయిన మనుజుని సంస్కృతికి బహు
జన్మ జన్మాంతర కృతాకృత
ఫల విపాకము కావలెన్.

VI

మానవు డనుషణ పురోగతి
సాగెడిని లక్ష్యాభిముఖుడయి;
నియతమగు పరమావధిని కళ్యా
ణముగ దర్శించిరి కవుల్.
పూర్వమే సర్వోత్తమం బని
ఆర్భటించు టనార్య దైన్యము
పురుషుడెపుడు నపూర్వ నిర్మితి
లాలసుండయి విలసిలెన్.

ప్రాత బంగారంబు కలదని
తనిసి రెవ్వరు ! క్రొత్తగనులను
వెదకి ద్రవ్వరె ? విశ్వ మనవర
తాభిమాన చయనము గదా ?

ఆకుటిండ్లను చుట్టు గుడిసెల
విప్పి కట్టరె మేడమిద్దియ?
గొడ్డునేలలు వదలి కన్నె పొ
లాలనాటరె యంటులక్క.

తోళ్ళు నాకులు తాలిచిరి మా
తాతపాదులటంచు ధవళ దు
కూల పీతాంబరములను ధరి
యింప మే మన మావర్ల,

VII

మునుపు మునుపని మొత్తుకొందుము
మునుపుకాదో నేడు రేపటి
కక్షయంబగు నీ ప్రవృత్తము
ఆగు పెపుడో ఎక్కడో.

పరిమితము ఆయుఃప్రమాణము,
సగము నిద్దుర; మిగత సగమున,
ఎందుకీ వంధ్యాస్తనంధయ
రూఎరేఖాతర్కముల్.

ప్రాతపడినను పసిడి ముక్కకు
త్రుప్పు పట్టదు; క్రొత్తదయ్యు అ

యోమయశలాకా ప్రకాశము
మాసి త్రుటిలో పసచెడున్.

లోహ పాషాణముల నైతము
కలదు జీవత్ ధాతు భాగము,
అవితథము - అకాల ధారాఽ
చ్ఛేద్య మది నశియించెటుల్ ;

పృథివిమయ గంధంబు వంటిది
జాతి సంస్కృతి; మానవ మన
స్సాంత్వనానుష్ఠాన పరిణతి;
అది క్షయించుట యెట్టులో.

కలదు కల దధిక ప్రకాశము
తోడ నారీ నరసమాజము
శాంతి గని సుఖియించు కాలము;
ఏటికీ గుంజాటనల్ ?

★

ఫాల్గుణి

అరిగినవి పూర్ణిమలు అరువది
యెనిమిదీ దివసోదయమునకు
తిరిగినది నా బొంగరము లలితా
వరణమున లలితంబుగన్.

కన్నవారలు - కన్నులన్ ప్రే
మించి పెంచినవారు నరిగిరి-
వ్రాసి తుడిచెద రెవ్వరీ నా
మాషరావళి నెప్పుడున్.

చిన్న మొలకై - పెఱిగి చెట్టై
కొమ్మ లటు నిటు సాగి - రెమ్మల
నొత్తి - పువ్వులు పూచి - పిందెల
పండ్ల బరువై వంగెగా-

గోతులం బడి - గోపురంబుల
నెక్కి - ఇష్టానిష్ట ఫలముల
నవ్వి యేడిచి దవ్వు దగ్గర
లనక తిరిగెనుగా సదా-

చదువబోలును గ్రంథ మెంతో
అంచె నెంత తదర్థసారము ?
బండభూములు పదును గావట
ముసురు వానలు కురిసినన్.

మంచిమల్లెల తోట పెంచి స
రాలు తెచ్చును ఇంటి కొక్కడు-
తుమ్మలను కాపాడి కాలిచి
బొగ్గు లింకొక డమ్మెడిన్.

ఎవరు ఘనులో ఎవరు కారో
తెగని దీ తరతమ వివాదము;
పువ్వులకు బొగ్గులకు తథ్యము
అంతరంబిను లోకముల్.

దివసములు - వారములు - పక్షిము -
లయనములు - మఱి హాయనంబులు -
తిరిగెడిని బహు యుగయుగాంతర
కాల చక్రారము లటుల్.

ఇంట పుట్టిన రోజు పండుగ
దోరపాకపు గారె లరిసెల
భోజనమునకు వేళ తప్పెను
కూరుచుంటిని అలసతన్.

ప్రాతపడియును మాసి మాయని
వెండి తెరపయి విభ్రమించెను—
స్మృతి కలాపము చిత్రరూపక
మట్లు - కంతము కదలగాఁ.

సుప్తమానస సరసి మేల్కొన
తల్లి తామరపూల పాలను
ప్రాగుచున్న స్తనంధయాళికు
లంబు లేచె రణించుచున్.

స్వరము వలె లాలించి - శబ్దము
వలె ధ్వనించిన ఆస్మృతి శ్రుతు
లాలకింపుడు - ఆలపింతును
అర్థసంవృత పదపదిఁ.

II

సృష్టి ఒకటె అనంతమయ్యును ;
సూర్య చంద్రులు - వాయు జలములు -
నింగి నేలయు - రేలు పవలును
ఒక్కటే యెందేనియున్.

చేతనాచేతనముగా రెం
డాయె కనబడు జగతి యంతయు -
యుగయుగాంతర పరిణతిఁ నరు
డగ్రసరుడై పైకొనెన్.

మనసు తర్కింపంగ బుద్ధివి
నిశ్చయింపగ నిష్ఠతో కర
చరణ సహ కౌశలము నెఱపెను
ఇహ పరోభయ కామియై.

పర్ణశాలల తపము సలిపెను
క్షేత్రముల కృషి కర్మ జరిపెను
గురువుగా - కులపెద్దగా - జన
నాయకుడుగా భాసిలెన్.

అత్మ యమ దమ నియత ధారణ -
బాహుబల శస్త్రాస్త్ర సాధన -
లక్ష్య లక్షణ శిక్షలన్ - మా
నవులలో తెగ లేర్పడెన్.

రఘు కులీనుల భ్రాతృబంధము
పాండు కురుకుల బద్ధవైరము
ఘోరయుద్ధములై శమింపగ -
కీర్తి సన్గెను జాతికిన్.

జ్ఞాతులును జ్ఞాతులును - మతములు
మతములును - రాజులును రాజులు -
అసహనముతో అలిగి పెనగిరి
స్నేహదీపము లాఱగన్.

కుచ్చితంబో - మచ్చరంబో
అంకురముగా అల్లుకొనె పగ
దాలి వలె; సుడిగాలి కెపుడో
మండి గృహమును కాల్చదే!

పగులువాటిన ప్రహరి గోడలు -
గడియ లూడిన తలుపు తెక్కలు -
ధర్మసత్రము పగిది నీ బం
గారుగడ్డ నిలంబడెఁ.

ఓడలఁ బడి - లోయలఁ బడి
వచ్చి మూగిరి పచ్చిదొంగలు;
కలుచుకుక్కయు - కొట్టుకట్టెయు
లేకపోయిన దయ్యెడఁ.

బొక్కసములను పగులగొట్టిరి
గుళ్ళు గోపురములను త్రవ్విరి,
వెండి బంగారంగడుల బిడి
కొల్లగొట్టిరి స్వేచ్ఛగాఁ.

గర్భవతులను - బిడ్డతల్లుల
నరటితోటల యట్లు నఱికిరి-
పాడియావుల పగులగోసిరి
పనసపండ్ల విధంబునఁ.

అతి భయానకమయిన హింసా
కాండ 'తాండవ ఘాతలకు ప్రజ
పజచె వెజగొని' - తరువుకూలిన
దిక్కుమాలిన పక్షులై.

రత్నకాంచన రజతరాసులు
దోచుకొని ఆ దొంగతొత్తులు
దొరలలాగున తరలిపోయిరి
నిండుసంచుల తోడుత.

పాడి మొదవుల పచ్చిమాంసము
చిన్న బిడ్డల చేతిగాజులు
తినిరి - కొనిరి - వధించి - విరిచి - క
సాయి కేది నిషిద్ధమో.

అదిమొదల్ పరదేశవాసులు
యాత్రికులమని వర్తకులమని
మెల్లగా జొరబడి రెడాపెడ-
తెనె మరిగిన తేటులై.

రాజ్యముగ వాణిజ్యతంత్రము
మాటిపోయెను తీరుతీరుల-
మారుమ్రళ్ళ నపాయమెంచక
గాయపడె దేశాంగమున్.

పాతుకొనె అన్యప్రభుత్వము
ప్రాకి సకలానర్థకముగా-
పాదులంబడి వేళ్ళుకొఱికెను
జాతి జీవద్వృక్షముఁ.

కులవిభేదము - మతవిరోధము-
పొటమరించెను స్ఫోటకమువలె
ఇరుగుపొరుగుల యిష్టబంధము
తెగెను పురివిడి కటకటన్.

ఎగుమతులలో - దిగుమతులలో
నిధులు నిక్షేపములు కరిగెను
ధనికులే అతిధనికులుగ - నిరు
పేదలయి పో పేదలున్

అన్నదమ్ముల - కాలుమగలకు -
మనసు ననుమానముల విఱుగఁ
పాము చుట్టము పడగ పగయై
బోర్లపడె సంసారముల్.

క్షుద్రమైనను సుస్వతంత్రము
అఖిలసుఖముల కాటపట్టగు.—
గొప్పదేని పరాయిపాలన
చీడపురుగగు జాతికిఁ.

ఎండగాడ్పుల చేడ్పడిన జన
మానసము కాసారమట్లు గ
తాగత తరంగాహతివ్యధ
కొట్టుకాడె కలంతలఁ.

కత్తిత్రిప్పిన గండుమగలు పొ
లాల నాగలి మేడిపట్టిరి,
పూలు పంచిన లావికలు పొయి
కట్టెలమ్మిరి వీథులఁ.

సంస్కృతియు - సంపత్తియును జివ
సత్వసారము లదవదంబడ
జాగ్రదుత్సాహములు శోషిలె —
గ్రీష్మకుల్యాజలములై.

ఒకటి వెనుక మఱొకటి యిటులా
నాటి భారత భారరూపము
పీడ కలవలె కలత పెట్టెను;
తెల్లవాఱవొ చీకటుల్.

★

ప్రాంజలి

భావింతునా పాలవెల్లిక
ధ్యానింతునా తెనుగుతల్లిక,

వాల్మీకిశోకంబు ప్రవహించె శ్లోకమై
నన్నయ్య కంఠాన నటియించె భారతము
భావింతు నా పాలవెల్లిక

కాళిదాసుని భణితి నోలలాడెను కళలు
తిక్కన్నవాకింద్ల తిరునాళ్ల సాగినది
భావింతు నా పాలవెల్లిక

దండి మృదుచరణాల దయివారె పదరీతి
శ్రీనాథునడవళ్ల చిందె శృంగారంబు
భావింతు నా పాలవెల్లిక.....

శూద్రకుని భావాల చుంబించె ప్రేమరతి
పెద్దన్న ప్రియవాణి పిదికె పీయూషమును
భావింతు నా పాలవెల్లిక.....

హాలు జానపదాల సోలె పడుచాగడము
రామకృష్ణుని ఆదరంబందె అక్కయ్య,
భావింతు నా పాలవెల్లిక... ....

★

ఏరుడుపూలు

మొగ్గనవ్వి తెక్కలు విచ్చి - పొట్టిపగల
నవ్వి ఱుక్తి ముత్యంబులన్ రువ్వు - చెట్లు
నవ్వి లేతకెంపుల వాయనంబులెత్తు,
శబ్దములు నవ్వి అర్థకోశములు తెరుచు.

నవ్వులోన ప్రీతి నాట్యంబులాడును
నవ్వులోన ఈసు నవసిపోవు
నవ్వులోన వ్యాధి నశియించు నంతంత
నవ్వులోన ముదిమి నవకమందు.

నిజము నేను ప్రేమోన్మాదిని భువిలోన
ఎవ్వడెఱుగు అస్మన్మగ్ధ హృదయతాప;
మరవగా గొంతుపిసుకు బోయలకు నగునె
తీవ్రమగు తల్లి గువ్వలతీపి నెరుగ.

కలికి కనుగొలకుల తొణకులిడు బాష్ప
కణములఁ చూడలేవామె ప్రణయశుచిని ;
కోక కుచ్చెళ్ళ రవికె బిగువులదార్తు
కుటిల దృక్కుల నీరాగ ఘోషయేమొ.

కలికీ! కాటుక పిట్టలకా విడిచి తేకాంతంబునకా కుచ్చు పె
క్కుల నాడించుచు నాపయికా దుమికి లగ్గల్‌పట్టె; ఏదేవి దం
డల చాటయ్యెద ఏరహస్య తలిపాటం బోవనాకౌను కో
మలిరో! ఈతరుణవ్యధాపనయ మర్మంబేదొ తెల్పంగదే.

జంట కలవలో - జాజి గుత్తులో
వామిడిచిగురో - మల్లెమొగ్గలో
తామరపువ్వో - తమలపాకులో
ఏమి కావలెనోయీ పాంథుడ!

★

కోయిల

I

ఎన్నినెలలాయెనే యెలసాని కోయిలా !
జిన్నికట్టాము నీ సన్నాయి పాటకయి
ఎన్నినెలలాయెనే యెలసాని కోయిలా
నిన్నుంచుకొని రెవరు నీ పాటలకు మురిసి
ఎన్నినెలలాయెనే యెలసాని కోయిలా

తుంబురుడు శ్రుతిచేసి తోడిరాగము నెత్తి
ఆలపింపు మటంచు యాచింప ఆగితివొ !
ఎన్నినెలలాయెనే యెలసాని కోయిలా

నారదుడు తనవీణతంత్రు లల్లటపెట్టి
సవరించుకొనుదాక స్వరజతులు పాడితివొ
ఎన్నినెలలాయెనే యెలసాని కోయిలా !

రాధమెచ్చని పచ్చిరాగాలు దిద్దగా
బాలకృష్ణుడు నిన్ను బ్రతిమాలి నిలిపాడె
ఎన్నినెలలాయెనే యెలసాని కోయిలా !

వార్ధకంబున బ్రహ్మ భణితిభంగిమ చెదర
నిను నిలిపెనో శ్రుతుల నిజరూపముల నెరుగ
ఎన్ని నెల లాయెనే యెలసాని కోయిలా !

II

వచ్చావె కోయిలా వన్నెలాడే నెలకు
పచ్చి పడుచుపదాల వాకిండ్లు తీయగా
వచ్చావె కోయిలా

పల్లవించినతరులు పచ్చగిల్లినమరులు
వన్నెలద్దిన వసుధ పమిటకొంగులనంటి
వచ్చావె కోయిలా

పలకవే కోకిలా పన్నీరు చిందగా
చెప్పవే సిగ్గడచి సింగారముల మాట
వచ్చావె కోకిలా

మావి కన్నెరికమే మరులు గొల్పెనో నిన్ను
నీ పిలుపుతో మావి నిలువెల్ల పూచెనో
వచ్చావె కోకిలా

పదినెలలు పొరుగింట పల్లెత్త కెసవోయి
పుట్టింట గయ్యాళి పోకిళ్లు చూపగా
వచ్చావె కోవెలా

బాలలను మురిపింతు పాంథులను వెరపింతు
దరహాసమో గడుసు పరిహాసమో గాని
వచ్చావె కోకిలా

మావిమోవిని కొరికి మత్తిల్లి మైమరచి
రంగధామునిమీద రాగాలుతీయగా
వచ్చావె కోకిలా

పాపమ్!

ప్రియమూర్తి బాపు ఘాతుక
లయకాల ఖరాగ్నిలోపలన్ నవనీతం
బయిపోయె, పోవుపెటు హిర
ణ్మయ దేహాహుతి? అది పరిమళమయి రాదో!

చంపితివే మహాత్ముని నృశంసకులాధమ! తండ్రిలేక దుః
ఖంపడు పిల్లలట్టుల జగజ్జన మెల్లెడ శోకపాతమై
కంపిలె, జ్ఞానభాండము నగల్చినభాతి సుధర్మ సూత్రమున్
త్రెంపినరీతి యయ్యె భవదీయ కిరాతక కృత్యమయ్యెడన్.

హింసయె నీ స్వధర్మమగునేని, భయానకబద్ధ దుర్వధా
మాంసలమేని నీ బ్రదుకు, మానవపాంసన మాతృగర్భవై
తంసికులేల కన్నడరు ధారుణిలో? విషకంటకద్రుమ
ధ్వంసనమేది పుణ్యఫల పాదపమున్ తెగగొట్టి తక్కటా!

పలుకం డెన్నడు వైరికోటికిని తాపంబిచ్చు దుర్వాక్యమున్,
సలుపం డెయ్యెడనేని లోకజన కష్టంబైన దుష్కార్యమున్,
తలపన్ లేడెపుడున్ మతాంతర కులాంతర్ద్వేష; మా నిత్యని
ర్మల నిస్సంగుని కాల్చి చంపితివి బ్రహ్మాండంబు ఘోషింపగన్.

ఋషితుల్యున్ కరుణోపయుక్త స్నపిత శారీరున్, మహావృద్ధు కి
ల్బిష రాహిత్య మనోవచోవపురనుద్వేగున్; భయద్వేష దు
ర్విష దష్టంబయి తూలు భారత జనారిష్టంబు శాంతిక్షమా
విషమస్థాయికి త్రిప్పి తేర్చిన తపస్విన్ చంపి తేపాపమో!

నరమాంసంబు భుజింపనెంచి తలకొన్నావో, అహింసాతపః
పరిశుద్ధంబగు పుణ్యరక్తమును త్రావన్ దప్పికొన్నాడవో,
దురితగ్రామణీ! కాల్చినాడవు మహోత్కృ; లేదురా నీదు దు
ర్ధర కుక్షిక తనియింపజాలు మద మేధ్యంబేని ఆ మేనిలోక.

కుల విద్వేషము కుష్టదోషమయి ప్రాకుక సంఘ కాయంబు, క
శ్మలమై కుళ్ళు కుటుంబ తామరస కాసారం, బసూయా విశ్వం
ఖలులై నిర్ధనికుల్ మహోధనికులుక ఘర్షింత్రు, కల్లోల సం
కులమై దేశ మపాయ సంశయములక క్షోభించునో క్రమ్మరక.

అవసాన సమర్పణ

(డాక్టర్ రిజాల్ కృతికి అనువాదం)

I

సెలవమ్మ దేశమా సెలవిమ్ము కడసారి?
దేశమా ? నాజీవితాశాప్రకాశమా ?
జాత్యభినివేశమా ?
స్వర్గ ప్రదేశమా ?
సెలవిమ్ము-సెలవమ్మ !

సూర్యు డుయ్యెలలూగు సుందరాకాశమా ?
ప్రాగుదధి మెఅసేటి ముత్యాల కోశమా ?
ప్రేమించి సేవించి
ప్రీతి పూజించాను.
సెలవమ్మ దేశమా ?

మద సుగంధాలతో మధువు పొంగులురాక
పూచి కోమలముగా పరువమ్ము పైకొనక
జిగి చవులులేని యీ
జీవితము నర్పించి
పోయెదను దేశమా ?

ఇనుప కంచెలముండ్లు కొఱుక నెత్తురుకార
సన్నిపాత జ్వర క్షోభలో నెందఱో
తడబడక ప్రాణాలు
ధారబోసిరి నీకు
సెలవమ్మ దేశమా ?

ఏదయిన నొక్కటే నా దేశమునకేని
కమలమో-కర్ణికారమొ-శిఖాభరణమో
ఉరికంబమో-ఘోర
సమర సంరంభమో
ఏదైన నొక్కటే.

II

కటికి చీకటి కట్లు తెగి విడ
స్వర్గ నిలయము తలుపు తెరిచే
ప్రొద్దు గని నే పోదు సుఖముగ
కోరికలు పండిన యటుల్
కోర్కెలన్నీ తీరగా—

శాశ్వతశ్రీ శయనతలమగు
నీ ప్రియోజ్వల నిస్తులోన్నతి

నిలిచి వెలిగిన చాలు నాకీ
మరణమే పరమార్థమౌ -
ఆత్మకును సంవరణమౌ.

ఎచటనైనా ఎప్పుడయినా
నా సమాధికి పైన ప్రక్కల
పచ్చికలలో పుష్ప మొక్కటి
మెఱయుచున్ కనిపించినఁ.

అదియె నా హృదయంబు - ముద్దిడు
మాచలువ శిల కడ్డముగ భవ
దధర మధుర సుధా సుగంధము
లలమికొన సుఖియించెదఁ.

నాదు ప్రేతకు కావ లుంచుము
స్తబ్ధ నిశ్చల జడ నిశీథిని -
ఆనపెట్టు ముషస్సునకు తన
వెండి నవ్వులు విసరగాఁ.

గాలి నడుగుము జాలి కురిసే
శోకసూక్తము పాడుమంచును
వేడుకొను మే పక్షినైనా
శాంతిపర్వము చదువగా-

మండు పెండకు - వాన నీటికి
మటిగి, కసటులు విరిగి తేటలు
తేరి నాదు సమాధి తడుపుచు
జీవ తపనల నార్పుతఁ.

చెప్పు మొక చెలికానితోనే
కూలితిని దుష్కాలగతి నని,
అస్మ దఖీయ శాంతికై ప్రా
ర్థించు నాత డుషస్సులఁ.

III

అపమృత్యు మెవరెవరినేరి యెత్తుకపోయె,
దుర్మరణ యాతనలతో నిహతులై రెవరు,
ప్రేమింపుమీ వారి ప్రియజనుల ననదలను-
దీనయై దురపిల్లె దేశమీ పాపమున,
ప్రార్థింపుమీ ! ఏత
దాత్మ ప్రశాంతికై
త్యాగ ప్రపత్తికై
చరితార్థ వినుతికై.

గడ్డుచీకట్లి పెక్కుల క్రింద కనబడక.
భూతములు తేల కాపున్న నాదు సమాధి,

సుప్తమై యుండగా, గుప్తముగ వినెదీవు
ఏకతారస్వరము నెడనెడల సన్నగా-
ఆది నాదు కంఠంబు
అదె నీదు సుస్తవము
అదె అస్మదనుగీత,
అమృత స్వదేశమా !

నాపేరు వినబడక, నా సమాధియు పూడి,
'సిలువ' విచ్ఛిన్నమై 'శిల' పా తగలినప్డు
నాగళ్లు దున్నగా నలిగి పాఱల నెగయు
నాయూరుపులు విశూన్యముగాక, ధూళియై
తల్లిరో ! నీదు మె
త్తని పాన్పు దుప్పటై
విస్తరించుత ! నాకు
వేడ్కగా కడసారి.

IV

నాదు ప్రేత సశేషమభిజన
దిగ్గుహాలానిల తీర్థముల లీ
నమగు; పిమ్మట నాకథ ననుమఱచిపోతే మానెలే.

తెగని తంబుర తీగనై నీ
అమృత చరిత పదావళిని స్మరి
యించు చాలాపింతు రేలను;
ఆదియె నా సకలార్థమున్.

వాదు ప్రేమకు పాదులగు ఈ
దేశమునకును దేశప్రజకును
అంకితముగ రచింతు శోక
శ్లోక మార్తస్వరములన్.

కలలలోపల కళలు సాకిన
నాయపేక్షల కామ్య కాంక్షల
నిత్తు నిష్టార్పణముగా దే
శీయ దేశారాధనన్.

పోయెదను కదలి ఆ పొలిమేర భూములకు-
ఎచట భూతుకులున్, నియంతలున్, హింసింప,
రెందు బానిసలై క్షీయించి చావరు ప్రజల్
ఎచట న్యాయము క్రుంగ
దీశ్వరుడె ప్రభు వెందు
పోయెదను కదలి ఆ
పొలిమేర భూములకు

పుట్టి పెరిగిన యిండ్లు పొడగాటి పడికూల-
తలిదండ్రులకు సహోదర సుహృత్ సచివులకు-
అస్మదంత్యాంజలి సమర్పింతు ఈమార
ణోద్వేగము శమింప
నున్న దివసాంతమున.

వందనము పరదేశవాసీ!
వందనము స్వస్థల నివాసీ!
వందనం బందఱికి - చావే
జీవితమునకు శమనమౌ!

★

చెళ్ళపిళ్ళ మహాకవి

గుణవత్సలమతి, కమ్మృత ర
మణీయ కవితారసాల మధుమత్కృతికిఁ,
ప్రణత కుమారాంధ్ర కవి
ప్రణుతులు శ్రీ వేంకటేశ్వర బృహస్పతికిఁ.

ఉభయ సుధీపరిషత్ప
ట్టభద్రుడయి వెలయు వేంకట కవీంద్ర గురు
ప్రభుపాదున కివె మా వా
గభినవ కాదంబినీ పయఃపాద్యంబుల్.

భవదీయ కావ్య శారద
నవరాత్రవ్రత సమర్చనఁ నిండిన దీ
కువలయ కోమల భాండ మ
నవద్యము కళాప్రపూర్ణ నైవేద్యముగాఁ.

★

మిశ్రమంజరి

కావ్యకంఠ గణపతిశాస్త్రి

రమణమహర్షి సచ్చరణరాజసరోజ సహస్రరేఖలన్
ద్యుమణీ కరాభిషేచనము నోజ ఫలించు అనుగ్రహామృతం
బమలిన నిష్ఠ గ్రోలిన మహామతి వీవు నుతింతునెట్టు ల
స్తిమితవచస్సులన్ గణపతీ! నిగమాంత సరస్సరస్వతీ!

ఋష్యభిగీత మంత్రపదవృంతములన్ కుసుమంబువోలె, ని
ర్దూష్యముగా వెలుంగు మహితున్ భజియించి, తపఃపయస్సులన్
పోష్యమలైన యీభరతభూములలోన, తదీయదీప్త వై
దుష్యము నిల్పవచ్చితివి 'తుభ్య మహం నమయంచు' పల్కెదన్.

అక్షయ భోగభాగ్యముల నంది, జగత్తునకెల్ల సర్వతో
భిక్షము పెట్టినట్టి ఋషివీర కుటుంబము నేడు భేదవా
దక్షితగాత్రపక్షమయి తల్లడమందును ఆర్యదీప సం
రక్షణ మాచరించుట పరాయణమౌ కవికంఠ! సంయమీ!

★

రామలింగారెడ్డి

పిండీపిండని పాడియాలవలె రాపిళ్ళాడు కాదంబినీ
కాండం, బుర్వర పచ్చకోకలను సింగారించు నీవేళ పూ
దండల్ దక్కను ద్వారబంధముల సంధానించి ప్రేమోత్కటా
ఖండ స్వాగతమిత్తు రాంధ్రు లనురాగస్ఫూర్తి రెడ్డ్యగ్రణీ!

ఆజిఁ మార్మ్రోగమీక దిగ్విజయ కన్యాకందుకంబౌ కుసుం
బా జెండా నెగగట్టి, కావ్యసరసీమాధ్వీపిపాసారతిఁ
మోజుల్ మించగ మా యనుంగు తెనుగుం బూదోట పోషించ రే
రాజుల్ వారలజూతు నీ మొగము చాఁఁ రామలింగాగ్రణీ!

తొడిమెయు పూవు నదుకుపొందికలు సూపు
పదభావముల కొక్క పాన్పమర్చి,
విడెపు వన్నెలు పెదవి మెఱుం గలదిన ట్లి
లంకారముల నర్ధలలన నేలి,
లతిక నికుంజ వలయము నల్లినరీతి
కథకు తెంపులులేని గమకమిచ్చి,
కలహంస కొలనుల యలలనూగెడి భంగి
నుడుల కొయారంపు నడలునేర్పి

రసికు నర్మోపగూహనరాగ మొకట,
వీరు నిజభుజాస్ఫాలనావేగ మొకట,
ప్రకృతి తనవశమైనట్లు ప్రతిభతోడ
భారతమునేలె నే కవిబ్రహ్మ మున్ను.

అతని తెనుంగు తీర్పుల రహస్యములకా గుఱుతించి, తత్ప్రిభా
యతజయలేఖినీముఖ నిరంకుశ పాలిత భారతీకలా
న్విత రసరేఖ రాగిలిన నేర్పరివంచును నీదు భావలా
లిత కృతిమద్వీపంచి కదిలింతుము నేడు కుతూహలంబునకా.

చవిచూచితి స్వతంత్ర చైతన్య భావనా
మాంసలాంగల కవిహంససూక్తి,
పాటించితివి స్వైరభావభోగరిరంస
నెసగు పరాసుల రసికలిప్స,
క్రీడించితివి ప్రౌఢి పేడెత్తు సూరన్న
సుకవివాగ్గోహన శోభనమున,
వెలయించితివి కండగల తెనుంగున కావ్య
తత్వ మానందసూత్రముల సరణి,
నేడు నీకంటె నీ యాధునిక మహాంధ్ర
వాఙ్మయము నడిపింప నెవ్వడు సమర్థు ;
డెలమి నీ కంకణము ధరియించి ముందు
త్రోవ చూపుము రామలింగావతంస !

★

*నందా !

పుట్టితివి ప్రొద్దుపొడుపుల
నట్టింటను మొలిచినట్టి నలినముపగిదిఁ,
నెట్టితివి పదారేడులు
మట్టీముట్టక ప్రపంచము చిదానందా !

ఎక్కడ పుట్టితి ? పెరిగితి
వెక్కడ ? నీ చదువుసాము లెచ్చట నడిచెఁ ?
ఎక్కడికి లాగె మృత్యువు ?
అక్కట, మన బంధ మిట్టు లగునా నందా !

చదివితివి వయసుమించిన
ఉదాత్తవాఙ్మయము శారదోత్సవముగ, నీ
కొదవిన మేధాప్రతిభల
కొదవదె సరిపోవు కాల మూర్విని నందా !

నడుతువు కరికలభముగతి,
నుడువుదువు మరందరస మణువు లణువులుగా
జడిగొన ; నీ కంఠస్వర
మదగునె శ్రీరామరామ యనుచును నందా !

---

*పుత్రుడు జననం 6-7-1932. అస్తమయం 13-6-1948.

మితభాషివి, గత దోషివి,
స్మితముఖుడవు, సితదుకూల మృదు వేషాలం
కృతి సుఖుడవు, నీ రూపము
స్మృతిపథమును తొలగిపోవు పెటులో నందా!

బంగారుపలక భాతిని
రంగారెడి నీ యురంబు రమణీయంబై,
పొంగెడి రవనవ్వుల నీ
మంగళవదనంబు, మాయమాయెనె నందా!

తలవాల్చి యెరుగ వెన్నడు,
కలతంబడ వింత విరిగె గగనం బన, నీ
లలితనిరామయవృత్తము
తొలిగెనె కలలోని పసిడితునకయి నందా.

యోగభ్రష్టుడ వయి నా
యాగృహమున బుట్టి తనుచు నెరుగకపోతిన్
సాగితివో నియతాయు
ర్భాగము పూరించి బ్రహ్మపదవికి నందా!

లేకున్న నే మహారుజ
నీకాయము నావహింప నీగ్గై నటంచుఁ
వాకొందుము? దుర్వ్యాధులు
రాకియె త్వాదృశులు పోదురా నా నందా!

యావద్ధర్మాచరణకు
తావలము శరీర మనిరి తత్వజ్ఞులు, నీ
జీవితము బహుపురాకృత
కేవలనిశ్శేషకర్మ కిరణమొ ? నందా !

చిరిగిన వస్త్రము విడుతురు
ధరియింత్రు నవీనమును ముదంబున ; కానీ
తరుణసుకుమార సుందర
పరిధానము విడిచి తే తపస్సిది నందా !

దేవతల కండ్లు కుట్టెను
తావక మేధాసురూపతరుణవిభూతుల్ ;
పూవును కోసిరి పూర్ణము
గా విచ్చి హసింపనీయకయె నా నందా !

గురుచంద్రబుధులు కర్కట
వరలగ్నమునఁ వసింప పాపం బగునే ?
తరుణవయస్సున కించిత్
పరిశిష్టము తీర్చవలసివచ్చితొ నందా !

అన్నమయప్రాణమయో
త్పన్నములగు వ్యాధు లౌషధముల శమించుఁ
ఉన్నదె నియతాయుస్సం
ఛన్నుల నాపంగజాలు సాధన నందా !

ప్రాణప్రయాణసమయము
రాణించెను రామనామరతమయి, తొలిక
ల్యాణమునకు పోయెడి వి
న్నాణము తోచె భవదాననంబున నందా !

అపుడపుడె కడిగి తుడిచిన
అపరంజికలశముపోల్కి నగపడె నీమో
మపగత రోగోత్పీడన,
నపరచ్ఛాయాభిరమ్య మయి నా నందా !

కనులు నిమీలితరుచి గొన,
మనఃప్రశాంతి మొగమున సుమాళింప, సమా
ధినిమగ్నుం డగు మహనీ
యునివలె దర్శనము నిచ్చితో నా నందా !

సదమలసుభగము లగు నీ
వదనలలాటములు బ్రహ్మవర్చస్సుషమల్
వెదజల్లగ తోచె మనో
ముదితచిదానంద యోగము చిదానందా !

సుప్తక్షీరసరస్సున
తృప్తాంతఃకరణసుఖరతిఁ దేలెడి ది
వ్యాప్తమరాళమువలె ని
ర్లిప్తుడవై సకలమును మరిచితో నందా !

కర్మబ్రహ్మిష్ఠులు, ని
ష్కర్మోపాసకులు దేని కాంక్షింతురో, త
ద్ధార్మిక తారకమంత్రము
నర్మశ్రుతి నందె నీ కనాహతి నందా !

నీయంతర్దివ్యస్వర
వాయువిలీనామృత ప్రవాహము వెడలెన్
పాయ లయి రామనామ
ప్రాయప్రణవముగ ఏ విపాకమొ నందా !

మూలాధార సముద్గమ
లీలారవమై అమృతవిలీనస్వరమై
ప్రేలెను రామస్మృతి నీ
లాలిత రసనామృతాల లతికను నందా !

మృత్యుద్రువనకుఠారిక,
అత్యుగ్రరుజాకులాచలాశని, మా శ్రీ
కాత్యాయని కావదెటు ల
పత్యమువలె నీవు నిలువవలసిన నందా !

ఉపనయనము కావింపని
అపచారము నాకు నిలిచె నందునొ, ప్రేతా
ద్యపగతులకు దాపెను నీ
తపఃఫలమె రాలెననుచు తలతునొ నందా !

తీరగ భవ దిహబంధము
జారెను నక్షత్ర మొకటి చదలున అమృత
ద్వారము తనంత తెరచిన
తీరయి నిరుపాధికస్థితి చిదానందా !

సోకినది పుత్రశోకము
మాకందదశాలవంటి మా యెడదల, సూ
చీకఠినాహతి బడె పువు
రేకుల కే నవక మిక ధరిత్రిని నందా !

భవబంధ చ్ఛేదన మా
కవశం, బిక దేహి దేహయజనస్నేహో
త్సవదీప మార్పినది మృ
త్యు, వీ మహాఘోరమే కుతుకమో నందా !

దురదృష్టుల మని పితరులు
దురపిల్లుదురో ? విముక్త దోషు డొక తపో
ధరు డస్మదన్వయంబును
తరింపజేసె నని శాంతి దాల్తురో నందా !

తలిదండ్రు లన్నదమ్ములు
చెలియం ద్రక్కలు నిక తనినెదరో యోగ
స్థలితు చిదానందు విని
ఖిర్మల బాంధవ మబ్బె చాలు మనకని నందా !

ధనభవనవస్తువాహన
ఋణానుబంధములు సోకనీయక, జననీ
జనకులతో గోత్రవిస
ర్జన మొనరించితి వసంగసంగివి నందా !

నీ తల్లిగర్భవాసము
పూతంబై, నిఖిలపుణ్యపూజాఫలమై,
భూతలి ధన్యం బాయెనో !
నీ తనుజత్వానుబంధనియతిని నందా !

నీరూపు గంధవతియై,
క్షీరోదకసరసియై, శిఖిశిఖాసఖియై,
ధీర సమీరమయి, వియ
త్తారామయ మగుచు పంచతన్ గను నందా !

నీనామరూపములు మా
మానసకాసారకమలమాత్రము లాయెన్
నీ నిర్మలాత్మ అమృతని
ధానబ్రహ్మైక్య మంది తనియగ నందా !

★

విస్సన్నపలుకు

చదివితి కర్ణుని చరితము
వెదచే కడు బిత్తరిలిన పెయ్యవిధాన,
బెదరిన కనుచూపులతో
మదియును చెదరెను అగమ్యమానం బిగుచున.

కర్ణుని గభీర జీవసాగర మదేల
ఘూర్ణిలి పరిక్షుబ్ధమయి పొంగులొలికెను దు
రంత దుస్తామసక్లిష్ట రంగములనె?
కేవల క్షోత్రపరిణామ మీవిధంబొ!

కుంతి గర్భము అవిముక్త కుసుమమనుచు
ఎరుగుదును - అనుగ్రహస్ఫుటామృతపుట స
హస్రకర తీక్షణ హవిష్యమనుచుగూడ
తెలియునింక తత్పరిణామ కలనమిదియె?

కుంతి ఆడుది - కడిపెడు కొడుకులున్న
నింత వెలితి సహింపలే దిదియ నిజమె?
కుటిలుడో క్రూరుడో అతికుత్సితుండొ
ఎవ్వడైన - కడుపుతీపి కెగ్గుకాడె?

కొడుకు కొడుకుచేత కూలునట్లా దుశ్శోక
మాపలేదొ ? ప్రేమ మాపలేదొ ?
నిందకేమి ? స్త్రీలు కందనిదెప్పుడు
దుర్జనాపవాద దోషహతిని.

తెలియక బాధించెను-తుది
తెలిసియు పీడించె నే విధివ్యపదేశ
స్ఖలనము - తద్విచికిత్సా
వలనమె కరానుబంధ భారతమగునో ?
ణి

కుంతి కంతశ్రుతులు పుల్కరింతలెత్త,
రాధ చనుబాలు గొంతులో రంగరింప,
కృష్ణసూక్తి ధర్మార్ధపంక్తిని కదల్ప,
తారుమారయ్యె కర్ణు మనోరథంబు.

ప్రాణికోటిలో ప్రజ్ఞాప్రభాసి నరుడు
అందు శూరు డుత్తమకుల యాయజూకు
డేత డున్మగ్నమగ్న ప్రవృత్తికళల
ననువదించెనె గూఢోక్తి మునివరుండు ?

శ్రీకృష్ణుని - నారీజన
లోక రహస్యానురాగ లోభమయునిగా
రేకించిన సాత్యవతే
యాకూతమున కిదె నా ప్రియాంజలినిత్తున్.

★

బ్రహ్మముడి

౧

అయిదువేలై అరువదేడులు - గడిచిపోయెను కలియుగంబున
పదియు తొమ్మిది వందలాయెను - ఇంచుమించు శకాబ్దముల్
రూపుమారక - వన్నెచెడ కీ - సృష్టి నిలిచెను చిత్రమునవలె
కాలవాహిని తేలియాడును - గాలిపడవ నిరంతమున్.

వాన కురియును భూమి పండును - సూర్యచంద్రుల చార తప్పదు
జనన మరణ పరస్పరముగా - లోకవృత్తము సాగెడిన్
గతము రా దాగతము పోదు, గ - తానుగతిరంబైన జగతిని,
మొదలు తుదల విచారతంతువు - తెగనిదే యేనాటికిన్.

మానవుని నిజ కర్మ ధర్మా - చరణములకు అవశ్యమాయెను
కాలమే; అనుక్షణ శుభాశుభ - చోద్య చోదక సూత్రమై.
అమవసకు రవి, పున్నమకు శశి, నాథులై యేడాది పొడుగున
నడిపెదరు కుశలముగ నీ బుతు రంగ నాటక చక్రము౯

కొమ్మలకు చిగురాకు కాసులదంద లిచ్చి వసంతుడేగెను;
కుందమాలలు గ్రుచ్చుకొని విరమించె వేసవి సందెలున్
మధువుత్రాగిన తుమ్మెదలవలె - రేగి మబ్బులు తూగి తొలగెను;
లలిత లలితార్చనల శోభిలి - ముగిసినవి నవరాత్రముల్

క్షేత్రమాత్మక లంపినవి సంక్రాంతి సారెలు చేరె నిండ్లకు;
హిమకణార్ద్ర విభూతి ధారణ - మునిగె భువి శివపూజలోన్

సృష్టికింకను బాల్యమెడలదు - అక్షితంబును అకృతకమునై
ప్రథమ నగ్నావస్థలో పొలు - పారుచుండెను ప్రకృతియున్.

ఒక్కవైపున నలుపు విటిగెను - తెలుపు చాఅలు చాఅలై దిగ
ఎగసె నెత్తురు ముద్దవలె నపు - డరుణ బింబము తిన్నగా.

దాపునం దొక యేటియొడ్డున - నిలిచిచూచె నరుండొకం డా
ఉదయ సంధ్యా సంనివేశము - అంగములు పులకింపగన్.

గాలి చక్కిలిగింతలకు, ద్విజ - పాళికలకలములకు అతని
కంఠనాళిక లులికి శబ్దిం - చెను ఉదాత్త స్వరితమై

కనుల కందము మనసు కానం - దంబు నద్దిన ఆయుషస్సును
దేవకలగా పొగడి పురుషుడు - కలయ జూచెను నలుగడల.

పాలుగాఅు కపోలములతో - మిసిమిజాఅని శిశుముఖముతో
నిలిచె ముందొక సుందరాకృతి - భువన సంమోహనముగా.

కలతపడె బహిరంతరింద్రియ - గతిగమక భంగీ ప్రకారము,
'కాసి' యనగా 'కోసి' యని మా - టాట పెకొనె మెతగా.

కన్నె చక్కదనాలపయి నా - కొన్నమురిపెము నోపజాలక
ఆ కిశోరము నెత్తికొను తమి - ముందు కేగెను పురుషుడుల.

ఎట్లు మెరిసెనో అట్టులే మరు - గయ్యె నా బంగారు ప్రతిమయు,
చెట్లదాపట గట్ల వెలపట - ఎంత వెతికిన నేమగున్ ।
అద్భుతము-ఆకస్మికమును - అభూతమగు సౌందర్య దర్శన
చకితుడై నరుడవశుడయ్యె-నగమ్యమానవ్యసనుడై.

ఆదిమొదల్ దినదిన ముషస్సున - కంజలింపగ వచ్చునాతడు,
కనబడని తెర వెడలినటు లగ -పడును అటనా బొమ్మయున్
ఋతువు ఋతువున రూపు రేఖలు - మాఱి, మవ్వముమీరి, లావ
ణ్యములు తేఱెను చిన్నదానికి - మొగ్గ పువ్వయి విచ్చదో ।
తనువు తళుకుల కులికె, కామా - క్షిములు సిగ్గులు చిలికె, ఓయ్యా
రములు నడకలనొలికె, ఆ లే - మొలక యెలజివ్వనము రాన్.

చెట్లు చిగిరించెను, లతల్ కుసు-మించెను, దిశల్ తాల్చెను కుసుం
భాదుకూలములను, నిశల్ హసి - యించె విమలాంబరములై.

తేనెకయి తారాడె తుమ్మెద - పాటకయి కారాడె కోకిల,
బహుముఖోత్సవ సుఖరిరంసా - తురములయ్యెను లోకముల్
ఆ మనోహర కామరూపము - హ్లాదమధుమయ హారి తరుణము,
ప్రియసముత్కంఠావరణ, మూ - గించె నరుమోహోద్ధతిన్

కొండయెక్కె నఖండదీపము - ముసుగువడె చీకట్ల లోకము.
నింగి వాకిట పెండ్లి ముగ్గుల - భంగి తోచెను తారకల్

పడుచు కరియావులను పిండిన - పాలు పోయుచు కలువ కడవల,
పంచదారను పంచవచ్చెను - చందమామ జగంబునన్
పట్టజాలని-పలుకరాని అ - వశ్య హృదయ రహస్యలాలస
అడిగె నరు డా పడుచు స్నేహము - నిష్క్రమించిరి యిరువురుఁ.

౨

"ఏను నేనని" ఇతర మెఱుగని-మనుజు డంతట "మేము మనమని"
నిలువబడె; అకాశతీర్థము - గంగ సందిటనుంబలెన్.
మెత్తపడె నరు పరుషవృత్తము - గృహిణీయయ్యె అనావృతశ్రీ:
మిధునముఖ మానస సరోవర - మలరె తామరతంపరై.
నడిపె నరు డిహలోకవృత్తము - నర్ధకామ ప్రదక్షిణముగా,
రెండు కొమ్మలకున్ తగిల్చి స్వ - ధర్మమనియెడి పగ్గమున్
ఆకలికి పక్వాన్నశాకము - లాస్వదనకు రసాసవంబులు,
పాన్పునకు తూలికల మెత్తలు - సంఘటించె సుఖార్తియై
రాళ్ళలో రమణీయ మూర్తుల - పసుల పొదుగుల పాలధారల,
ప్రతిలో మెత్తని దుకూలము - వెలువరించెను నేర్పునఁ.
ఎండు వెదురున తుంబికాయకు - నునుపు తీగెలు పెనచి, జీవము
పోసి, శిశుపశు పరవశంబుగ - తీసె తియ్యని రాగముల్.
చూచి తొలిమలి సందెలఁ పుల - కించి, విన్న అకృత్రిమ శ్రుతు
లతికి స్వర సంహితలుగా ఆ - విష్కరించె వచస్వియై.

సహచరీ సహచరులుగా స్త్రీ - పురుష లాదట కలిసి మెలిసిరి;
పాదుకొనె నా భావబంధము - వావి వరుసల గట్టులై.

కలడొ లేడో యనుచు భూమ్యా - కాశములు వెదుకఁ హృదంతిక
కోశమున నీవార శూకా - గ్రముగ మెఅసె తదంశయుఁ.

వేదవేదాంతములు-శాస్త్రము - లఖిల విద్యా ప్రకరణంబులు,
దేహి దేహ విభేద చింతా - చింతనల్ ప్రతిభాసిలెఁ.

పట్టణములను కట్టి, కళలను - దిద్దె, రాజ్యము లేలె, సాంఘిక
ధర్మములు శాసించె, మానవు - డేది సాధింపడు ధరఁ

రేలు పగలయినట్లు కాలము - తూర్పుపడమర లాయె భూమియు
వెలిగె ప్రాచీ చరితదీపము - దిగ్దిగంతోద్దీపనముగాఁ.

★

వాణి

వేదాలకు స్వరాలు పాదులై నిలువంగ
శ్రుతులాయె నీ వీణ, శుచిముఖీ వాణీ,

తొలిగాలి కదలి పైకి లువిప్ప నాకసము
శబ్దించె రెండు పక్షంబులను వాణీ!

నాదము

నాదకాసారమున నటియింపగా హంస
రాగతరంగములు తీగెగొనె వాణీ!
శిశువులును పశువులును చేతనాచేతనము
లాలించి పారవశ్యము పొందె వాణీ!

శబ్దము

కవికోకిల అవశ్య కరుణరతి కూజింప
నవరసంబులు పొర్లినవి పొంగి వాణీ!

భావుకులు రౌచికులు భాగవతు లాలించి
పొందినా రానందభోగములు వాణీ!

సంగీతసాహిత్య సహవాస సంస్కృతిని
శృంగారమాయె నరజీవితము వాణీ!

★

రేవుపాటి
(అనువాదం)

పడక కుర్చీమీద కూర్చొని
పైట జాటిన వయిన మెఱుగక
నయిసుగా అల్లికలు కుట్టె
క్రొత్తమేదల బిత్తరీ
నీ
కోస మెవరో వచ్చిరీ ;

* * *

చవితి సందెల చంద్రువంకను
తిరిగితే నీలాపనిందలు
వచ్చునని సూయాణమునకై
కూరుచుంటిని కల్లరీ ?
నీ
చూపు కుట్టినె దిమ్మరీ ;

* * *

పువ్వులా పువు మొగ్గలా ? అవి
పూల మొగ్గల నడిమ రెమ్మల ?
రెమ్మలొత్తే కన్నె తీగెకు

అల్లుకావలె సుందరీ
నీ
పంది రెక్కడ సుందరీ !

* * *

పూల బులపాటములు చాలును,
కాయలయితే చిలుక కొఱుకును
పండితే యిక రాళ్ళ దెబ్బలె -
శిరసు వాల్చక-నడుమువంచక
ఉండ దలచితి త్రోవరీ !
నే
నుండదలచితి త్రోవరీ.

*

వచ్చినావా ! ఎందుకోసమో !

(అనువాదం)

I

పూలకోసము ప్రొద్దు ప్రొద్దున
పంపితినిగదె బాసలాడీ !
ఇచ్చవచ్చిన పట్లు తిరిగీ
వచ్చినావా మచ్చరీ
యీ
వాలకం బెవరిచ్చిరీ ?

* * *

ఆడబడుచుకు నొప్పులంచే
మంత్రసానిని పిలవ పోతిని,
ఇంటలేదని వెంటబెట్టుక
పోయె కొడుకు పొలానికిఁ
నీ
తోడు నిజమిది నిగ్గరీ !

* * *

కొప్పు చెదరెను, కొంగు చిరిగెను,
గాయమాయెను రెండు బుగ్గలు,
ఒడలు తెలియని పెనుగులాటల

అలసి సొలసితి వెచ్చటో
యీ
ఒట్టులెందుకె దిట్టరీ !

* * *

గేదెకోసము కోసి పచ్చిక
మోపు నాతలపెట్టి సానిక,
నడిమిదారిని కట్టుతెగి పడ
ఒడలు చీరెను స్వామినీ !
నా
చెఱగు చినిగెను శ్రీమతీ !

* * *

II

పచ్చజొన్న పొలాల వంచల
వగలు పోవును సందెపయ్యెర
ఎందుకోసమె సుందరీ
నీ
వెరుగుదేమో సుందరీ !

తమ్మి కడవల తేనె చిలికే
తుమ్మెదల పయ్యెదలు లాగగ
కసరి కొట్టిరి పాంధుడా
ఆ
విసవిసలు ఇవి పాంధుడా !

తెల్లపువ్వుల రెవిక తొడిగిన
బీరసాని పదాలపైబడి
ప్రాకులాడును సుందరీ
విధి
వేడుకొనునో సుందరీ :

* * *

లోన అచ్చపు గుజ్జుమీగడ
పైన నెయిపూతల నిగారము
తథ్యమిథ్యలు పాంథుడా !
ఆ
తగులమెరుగును - పాంథుడా !

(బెంగాలీ జానపదాలకు అనువాదములు)

★

సరాగం

తలుపు తీయవే భామా! నీ
తలపు తియ్యనిదె భామా!

చిమ్మ చీకటుల చెదిరిన చూపున
దారితప్పితినె భామా! మెయి
భారగించినదె - భామా!

చలికి తోడుగా చలమరి పయ్యెర
వేధించెడినో భామా! నను
సాధింపకు మిక భామా!

వాకిట నిలిచితి వచ్చి యొంటరిగ
వచ్చందాలపె భామా! ఇది
వలపుల చాలపె - భామా!

నీ సిగపూల సువాసన లలకల
స్నేహకుటిలములు భామా - ఇటు
చెఱుగును వీథుల, భామా.

ప్రేమనగ్నమై పేడెత్తెడి నడి
హేమంతం బిది భామా-ఎటు
నైపగ నోపుదు భామా !

పారిజాత పుష్పంబుల పాన్పున
పవ్వళింతువే భామా-భాగ
స్వామి యెవ్వరే భామా !

ఉత్కంఠ

పూలకోసమే పుట్టిన భ్రమరము
కాలమెరుగునే సఖుడా ! తేనెలు తొణికే
కాలమెరుగునే, సఖుడా !

తారలకోసమె తారాడే శశి
కోరికతీరునె సఖుడా ! కొసరులు మరగిన
కోరికతీరునె సఖుడా !

వేడుకకొరకే తిరిగే కోకిల
చూడజాలునే సఖుడా ! చూత తరుణమును
చూడజాలునే సఖుడా !

లాలనకొఱకో పాలనకొఱకో
తేలుచుకొంటివె సఖుడా ! తెగని బిందమిది
తేలుచుకొంటివె సఖుడా !

★

పల్లెపడుచు

౧

ఊరికావలి చెరువులో నీరుతెత్తురు నిరతమున్
జారుసందెలు మెరయగా పల్లెపడుచులు కడవలన్,
ఈవలావల పెరుగుచున్ తావులీనెడు పొలములున్
త్రోవ కెండలు తగులనీ కావరించెడు తరువులున్,

కొమ్మకొమ్మన కులుకుచూ కమ్మకమ్మని పలుకులన్
దాపునం జను చెలువలన్ ఊపుచుండు శకుంతముల్.

౨

గ్రామవాసుల కనువుగా గ్రామభాగ్యము నరయుచున్
చంద్రశేఖరు డెసగెడిన్ చంద్రుబోలిన యశముతో.

పెద్దకాపయి గ్రామమున్ దిద్దు నాతడు చదురుతో,
సద్దుసేయరు జనములున్ రద్దిరచ్చలు లేమిచే.

౩

కూతు రొక్కతె అతనికిన్ చూతపల్లవ మనదగున్
మంచిగంధపు మొలకయో మించు ముద్దుల గిలకయో.

పూచిపూయవు చెలియొడల్ లేచిలేవవు మనసులుఁ,
బాలమోమున చిరునవుల్ తేలవింకను తేటగా.

పాలధారల కడిగిరో పూలపొత్తుల పొదివిరో
బాలికామణి ముఖకళల్ చాల దుర్లభ మవనిలో.

మొగ్గలోపలి మధువటుల్ సిగ్గుచిన్నెలు చెదరవూ
దోసపిందియ నునుపులఁ భాసిలున్ చెలిప్రాయముఁ.

౪

తెల్లచీరలు మరియునూ - నల్ల రవికలు తొడుగునూ
కలికి చెక్కులు పలచగా తళుకులొల్కును మిసమిసఁ.
నవ్వదెక్కువ సఖులతో రవ్వ పల్వరుసగపడఁ,
మాటలాడును మితముగా మీట భావము కన్నులన్.
మందమంతయు నడకలో అందమంతయు నుడువులో,
చింది చిందక మృదువుగా పొందుమీరును చెలియకుఁ.

౫

ఏటికావల పొలములో తోటవేసిరి కార్తెలో
కాసె మిరపలు మెండుగా - మాసిపోవగ పగడముల్,
ప్రొద్దు ప్రొద్దున నిత్యమున్ ముద్దులొలయగ నడుచునూ
చిట్టి కుచ్చుల యొడిసెలఁ చుట్టి కంఠమునకు తమిఁ.
బంతిపాదుల దాపటఁ వాటమగు వెలిపట్టునఁ
మంచివేసిరి మంచిగా కొంచెమెత్తుగ నిలువగఁ.

తోలుచుండును పిట్టలఁ బాల రాలగ తీయముల్
వింత వింతగు చెయిదముల్ కొంత కొంత కనంబడుఁ.

ఓ

నింగిపోయెడి పులుగులఁ పొంగి పొర్లెడి ప్రేమతో
పువ్వులిత్తును రమ్మనున్ నవ్వురవ్వలు చిమ్మగఁ.
ఏమికావలెనంచునూ ప్రేమ తీయగ అడుగునూ
గట్టులఁ జను జనములఁ కట్టివేయును కనులతో.
గువ్వజంటల దరియుచుఁ బువ్వపెట్టెద తినుమనుఁ
పూవుపై బడు తుహినమో - ఆవుపిండిన అమృతమో
అనగ ఆచెలి చెలువముల్
పెనగె ప్రాయవు చేష్టలఁ.

★

*కాపుకన్నె

శరదుదయ ప్రసారముల చక్కిలిగింతలు దిక్కులక మనో
హరముగ బుజ్జగింప, నునుపారగ రాలెడి క్రొత్తమంచు తుం
పురులు నిగారపుం బయిరు పొత్తుల ముత్తెములట్లు నిల్వ, వా
సరముఖ శోభనావిరళ శాద్వలమైన పొలాల గట్టులక.

నడకల కుల్కు కల్కు చరణంబుల కింపులు పెంప, చిన్నిచే
కొడవలిత్రిప్పికొంచు కళుకుల్ వెదజల్లెడు కన్నులం, దెడా
పెడ నెరివోయి కాటుక ద్రవింపగపోవుచునుండె కాపులే
బడతుక యొంటిగా వయసువాలకముల్ మురిపింప పాంథులక.

కన్నె చెక్కిళ్ల జిగినవకమ్మ చిమ్మ,
పైటమడతల నందము లాటలాడ.
పెదవి పగడాల చిఱునవ్వుపాలు తడప,
తానెఱుంగని సొగసామె పైని విరియు.

పీతశాలీ మృదూదర జాతములగు
పచ్చి పొట్టల నూపుచు నిచ్చపెనగి
సరిదుపాంత తృణాంచల శ్యామలవల
యములబడి పయ్యెరలు చెర్లాటలాడె.

---

*కాకెంపూడిలో వ్రాసినది.

మెడల మెత్తని పసుపు పట్టెడలు బెరయ,
కండపిరుదులు చెదర చక్కందనాల,
పోవుచుండె పచ్చని బీళ్ళ త్రోవలబడి
కాడి తగులని కోడెలు కావరమున.

గొల్లసతుల అచ్చంబైన యుల్లములను
బోలె శారదాపుత్రికా జాలమనగ,
పొదుగులను మోయజాలని మొదవు లపుడు
అడుసులేని రేవున వాగు నల్లదాపె.

చాళ్ళుపోసిన మొలక పచ్చల విధాన
మొక్కపైరులతోడ నపూర్వముగను
కనుల కెఱగొల్పుచుండె ప్రక్కన పొలాలు
కన్నెనడుచు గట్టున కిరుగడలయందు.

★

దూతిక

(అనువాదం)

ఓ ఉదయదరహాసినీ !
ఓ దివస సహవాసినీ !

బ్రహ్మాండ భాండమున పాలు పిదికేవేళ
ఏమిత్తు నీకు నాకోమలాంజలి పట్టి
ఉదయగీతానీత పాధేయమో !
అది తపనలో ఉడికి ఆరిపోతుందేమొ ?
ఓ ఉదయదరహాసినీ !

ఆ తరువు సిగమీద అసియాడు మొగ్గవలె
నాలోనె రవళించి నవ్వుపదమిత్తునా ?
అది సంధిబంధాల చెదిరిపోతుందేమొ ?
ఓ ఉదయ దరహాసినీ
ఓ దివస సహవాసినీ !

దివసావసానమయి దీప్తి తరిగిన పిదప
దెసమాలి వసివాడి తిరిగె దెక్కొడ సఖీ !

త్రోవతప్పి భ్రమించి - నావాకిటికి వత్తువో
ఏమిత్తు నీ కపుడు
కోమలాంజలిపటి
ట
ఓ ఉదయ దరహాసినీ.

ఉదయాస్తముల మధ్య ఉజ్వలించే దీప
మందించనా సందె యందాలు చూడగా,
ఆది స్వర్గసౌధాంతరాళ పీఠము మీద
నీ స్నేహధారతో నిలిచి శోభిలగలదు

మందలై జీవాలు సందడించేవేళ
ఎట్టు కొనిపోదువో ఆరిపోగలదు సుమి
గాలిలో-దారిలో.
ఓ దివస దరహాసినీ!
ఓ ఉదయ సహవాసినీ!

★

పారసీక పదాలు

(అనువాదం)

రాత్రి సగమాయె, మధుమందిరంబు దరిసి
ఆత్రమున తల్పు తలుపని అరచినాడ,
ప్రజ్వలించుచునుండె లోపల సదస్సు
వెండికలశంబులను పొంగుచుండె మధువు.

కలశములు సఖిపాంజేబు గజ్జె లట్లు
గలగలమని ఆరాట మగ్గలము చేసె;
తాళజాలక గొంతెత్తి తలుపు తలుప
టంచు అరచితి పెద్దగా నందె నిలిచి.

మొదట వినిపించుకోలేదు సదయు డెవడు,
కొంతనేపటి కొక్క భక్తుండులేచి
ఆ కవాట సమీపాన కరుగుదెంచె;
తూలు కంబళితో కనుల్ తూగియాడ.

పండ్లుకొఱుకుచు పలికె ఎవ్వండ వీవు?
ఏమి పనిమీద వచ్చితి విచటి కిపుడు!
ఎరుగవో యిది సుముహూర్త తరుణమనుచు
అందరును బ్రహ్మమున లీనమయిరి - పొమ్మ్మ.

★

ప్రేమార్చన

(ఎక్కాబ్ గీతం)

అలుగక విందువేని నిజమాడెద బ్రాహ్మణవర్య ! నీదు దే
వళమునన్న మూర్తుల ప్రభావ మభావమునందె చాల ప్రా
వడీనకతాన, ద్వేషగుణపాఠము లబ్బెను నీకుగూడ; మా
శిలల సమీపమందె మొలిచెన్ గురుపీఠమునైత మావలన్.

తలపులు ధ్యానధారలు యథాయథలైన పెనంగొనెన్ మత
ప్రళయ వివాదవైరము, భరంపడి వేసటజెంది నీదుదే
వళమును నా మసీదు, ననివార్యముగా త్యజియించితిఁ, నమా
జుల పిలుపున్ పురాణముల చోదనకూడ అపాకరించితిన్.

వలచిన తోటమాలివి ప్రభాతరుచుల్ పరికించి, క్రొత్తమొ
క్కల ననుపారనాటుము, వికారవిరోధములైన దుర్విషా
నిలములు పచ్చపాదులు తినెఁ, దరిశింతము రమ్మ దేవునిఁ
విలస దనంత మాతృపృథివిఁ శిలలఁ విడనాడి యీపయిఁ.

రమ్మిటు రమ్మ బ్రాహ్మణ ! పరస్పరముఁ కననీని యీతెరఁ
చిమ్మము చూరదూరముగ, చీల్చిన సూత్రముత్రెంచి, వీరలఁ
క్రమ్మర కల్పివేయుదము రమ్మ : ప్రజఁ విడదీయు ద్వైతభా
వమ్మును పారదోలుద ముపాయముగా నిటురమ్మ వేగమే.

హృదయగృహంబు పాడువడియెఁ బహుకాలమునుండి, రమ్మి కట్టుదమొక నూత్నమందిరమిటుల్, జగతింగల తీర్థయాత్రలం దది మహిమోన్నతంబయి, సమస్త సుహృజ్జనపూజ కొక్కటే పదమయి వెల్గుచుండును నభంబున తత్కలశాలి మ్రోయగన్.

ఆవల నస్మ న్మనోహరి ద్వారమందు
అతిమనోజ్ఞ మంగళకరమయిన ఒక్క
దివ్యమూర్తిఁ ప్రతిష్ఠింత మవ్యయముగ,
ఆ జగన్మాత వరముల నడుగవచ్చు.

హస్తమునందు మాలయు - నిజాంసమునందున జన్నిదంబు విన్యస్త మొనర్చి, యింపుగ శివాలయమందు మసీదులోని ధ్యానస్థిమితప్రభావము గనంబడ చేయుద, మాత్మదర్శనో పాస్తిని వచ్చువారికి కవాటము తీయుద మన్నివేళలన్.

అలవోకఁ ప్రతిజీవియందను ప్రచండాగ్నిఁ వెలింగింత, మ ఋషుల పోషెత్తు కవోష్ణ గాంగజలరాసుల్ పట్టి ఆమాల్యమం గళ పాదంబుల పాద్యమిత్తము, జగత్కళ్యాణ మంత్రాక్షరావళితో భారతమాతయంచు లిఖియింపఁ వచ్చు ఆమోమునఁ.

మరచిన ప్రేమసూక్త మహిమంబును, చీలిన యీ జగాన క్రమ్మర వినిపింత మర్థిమెయి, మస్తకమెత్తి తదీయమంత్ర సుస్వరములు వల్లె చెప్పుద ముషస్సులలో; అమృత ప్రసాదముఁ కొరవడకుండ ఆర్చకులకుఁ తినిపింతము, రమ్మి బ్రాహ్మణొ !

అర్చకులెల్ల మందిరమునందు సమాహితమైనవేళ, ప్రే
మార్చి రగిల్చి యీ మతమతాంతర వైరములెల్ల కాల్చి చ
ల్లార్చితిమేని, శంఖరవమందె సమాజుల పిల్పు మేళమై
పేర్చి వినంబడుఁ, బిదప ప్రేమనె నిర్గుణమందు రందఱుఁ.

దర్పణమంచు నెంచు మెడదన్ జగమంతయు; ఎట్లు వృత్తముఁ
నేర్పెద మట్టులే ప్రతిఫలించును దాన నిజంబు; కాన స
ర్వార్పణ వీరబుద్ధియు - ప్రియవ్యసనాతుర చిత్తముఁ, దయా
తర్పణ వృత్తియున్ తనువు దాల్చిన యట్లి వహింపు ప్రేమకై.

★

మీరాదేవి గేయము

మోసంబు నీ కెంత ముచ్చటోయీ స్వామి !
మూలమట్టము నన్ను ముంచావు వంచనన్
కప్పితివి నీ కరుణ కపటహింస నటించి
ప్రేమ ప్రసూనముఁ బీడింప వనుకొంటి
మోసంబు నీ కెంత ముచ్చటోయీ సామి

నా వంశ మెడబాపి నా పక్షములు నరికి
కాలుసూదులతోడ కాల్చితివి నా కాండ,
అసహదుర్భరమైన ఆ తీవ్రవేదనఁ
దెసమాలి ఉస్సురని కసికొటులాడాను.
మోసంబు నీ కెంత ముచ్చటోయీ సామి.

నీ దివ్య చుంబనానీతమై పూతమై
నా ముఖద్వారాల నవరాగములు ప్రోసె,
నీ చారు ముఖగంధ నిభృతమై, నిగమమై
ధారగిలె నీ గీత నారి క్త తనునాడి.
మోసంబు నీ కెంత ముచ్చటోయీ సామి.

తొలిజాము బాధలో దురపిల్లి క్రుంగితిని !
మలిసందె వేడ్కలో పులకించి పొంగితిని !
ఏడురంధ్రాలకే యేడ్చితిని ఆనాడు
ఏనూరు లే వంచు ఏడ్చు 'మీరా' నేడు !
మోసంబు నీ కెంత ముచ్చటోయీ సామి !

ఊర్వశి
(భావానుకృతి)

ం

కన్న తల్లివా ? కావు -
కన్నె పడుచువా ? కావు -
కులీన కళత్రమవా ? కావు - కావు.
శుద్ధసుందరివి,
శుచిమ దవిద్ధ శోభా నందనవు.

పడమటి సందెలు పసిడి తోయములు
విసిరి చల్లగా పసరు పచ్చికల,
చెంగావి చీరె చెఱంగులు లాగుచు
అలసట కోపని అంగకములతో
ఏ గృహాంగణము ముంగిట మంగళ
భోగ దీపములు వెలిగించెదవో ?

సందేహముతో చరణము లాడక
కళవళమున వక్షము కంపింపగ
—నమ్రనయన పాతముతో
—కమ్రస్మిత చేతముతో

లజ్జా మజ్జన సజ్జికవై, ఏ
శుభ్ర విలక్షణ శోభనశాలకు
సోలుచు పోయెద వొక్కతెవే?
ఈ నడిరాతిరి ఊర్వశీ!
ఉజ్వల నందన సుమరాశీ!

౨

తొడిమె లేని తొలిపుపుష్పము వలె
నీలో నీవే-యే ప్రొద్దులలో
పొడమి-పెరిగి-నడిమి వయసు
పొడివెన్నెలలో పూచితివో!

ప్రథమంబున మధురోదధి
మధియించిన మంచివేళ
తేలి-తేరి లేచితివో తియ్యముగా-కడునెయ్యముగా
—ఒక చేత అమృతభాండము
—ఒక కరమున విషపాత్రము!

ఉచ్చల తరంగ మధూదధి
—కదలక పడి యుండెడు నీ
మృదుల పద ప్రాంతంబున-
—మంత్రముగ్ధ మహోరగమటు

రోజుచు సహస్రఫణ
రోచులు తలలు వంచ-
ఊర్వశీ! -ఊర్జస్వల కామనీయ కలశీ!

3

అనంత యౌవన లతాంతరాశీ!
ఊర్వశీ! - ఎన్నడయినా ఎదిగితివా?
—ఎక్కడైనా ఎదిగితివా?
ఏటివంచ నడి ఏకటి
నేకాంత సుఖాసీనవై
ఆడుకొంటివా క్రీడాకుజముల?
ఆణిముత్యముల అచ్చన కాయలు

రవ్వల దివ్వెల రాణీవాసమున
సాగర సంభ్రమ సంగీతముతో
—స్మేరాననవై చిగురు నెజ్జపయి
నిదురింతువె? నీ నిండు కవుంగిట
ఎవ్వరుండిరో జివ్వనీ!

4

ఇంద్రసభా ముఖమున నీ
వేనాడో ఆడినావు—

—ఉల్లాసము కల్లోలముగాన్,
ఒడలు తెలియని ఒయ్యారముతో-
భువనముల చరాచరంబులు
పులకలతో మునిగి తేలె-
ఆ తరుణ మోహ తరుణంబున
భంగీ గతి గమకములు త
రంగాలయి చెంగలించె,
చెఱుకు పాలకడలి చిందులాడగా,
శ్యామల భూతల సస్యశీర్షములు
కంపనములతో కవకవ కుల్కెను:

నృత్యారభసమున ముత్యపు దండలు
నిగిడి తునిగి పడె నింగి తారలుగ

ఇష్టార్థాభినయ ప్రియమగు ఆ
లీలా తన్మయతా ధారణలో
మైమఱపుల బడి
హఠాత్తుగా హృది
మగని సందిటికి మరులుకొనెను తమి.

చేష్టా ధారల చినికెను నెత్తురు,
—ఒక్కమాఱుగా ఒరసి పిగిలి నలు
దిక్కు లెగసె నీ చక్కని మేఖల—

వివృతవో ? సంవృతవో ?
స్వచ్ఛంద స్వర్గ సౌందర్య ని
సర్గ గర్వరాశీ ! ఊర్వశీ !

౨౫

ధ్యాన తపః పుణ్యంబులు
ధారవోయుదురు భగ్ననిష్ఠులయు
మౌనులు నీ
సుకుమారచారు చరణముల,

నీ చూపుల జిగిరాపులలో
కర చరణాభరణ ధ్వనిలో
తన్మయమై రణోయించెను
యావ ద్యౌవన లావ
ణ్యాంబరమును చెలిమిన్

తన పీత జ్వలితాసవ
మదగంధము మోయ లేక
తారాడును గంధవహాము
లంధములయి దశదిశలన్.

ఆ సుందర శుభసమయమున
గీత విరచనాలుబ్ధ
గ్రీవుండయి ముగ్ధసుకవి

పాతరలాడును మధురస
పానాతుర భృంగమట్లు.

అందెలు సందడింపగా
ఆడ వెడలితి వాకాళంబున
జంకు లేని సమ్మదగతి
నర్తింతువొ నవనవముగ ?

శ్రీ రవ్యాత్

ఎవ్వడో కవి ! ఎవ్వడో ఇ
ష్టార్థపద శతపత్రసుందర
కుసుమకోశ మరంద సౌరభ
చయన కుశలుం డెవ్వడో !

ఎవ్వడో ! దార్శనికు, డమృతవ
చోరసాలకిసాల ఖాదన
ముక్తకంరధ్వని సుఖం బం
దింపజాలిన దెవ్వడో !

ప్రాయవోయి మహాకవీ ! ఈ
యాకసంబే కాగితముగా-
తారకాక్షర ధవళపంక్తుల
భావసవి సంగీతమున్

చెవికి తీయము చిలుకు శబ్దము-
కంటి కింపగు కాంత కల్పన-
కలిసి హృత్కోశమును తడిపే
తొలకరింపులె కావ్యముల్,

ప్రకృతి ముసలిది కాదు - ప్రతిఋతు
నవనవాలంకృతుల దేవత-
ఎందుకీ జీర్ణాంబరవ్యధ
క్రొత్తకోకలు నేయవోయ్.

వెన్నెలలలో వెన్నతీసి,
రాలలో ధాతువులుపోసీ,
మట్టిలో గంధములు మూసీ,
నేర్పె నెవడో కవనమున.

నాద సరసీ పద్మములు శ
బ్దిములు ; పుట్టిండ్లాయె మాకును
తాతకును ; వాచామతల్లి సు
భాసనంబది యెఱుగవో !

శ్వేత ధౌతాంబరము - ఋక్లా
భరణ హారము - హస్తవీణా
పుస్తకావరణముగ భాసిలు
కవి సరస్వతి సృష్టిలో.

నిగమములు సంధించె శ్రుతిలో-
గానమును బంధించె స్వరముల-
రసవదిష్టార్థ ప్రసన్నము
లాయె కావ్యంబులు కవీ !

సృష్టి భగవత్కామ మయితే;
కామ్యమగు మంగళము సృష్టికి,
ఏమిటి కమంగళ కలాపము
లాడి పాడ మహాకవీ!

దేవతలు దేవతలటంచును
కలవరింతుము, దేవసీమను
శబ్దసుందర రచన లెఱిగిన
కవులు లేరేమో కవీ!

వారి భాషను వ్యాకరింపగ,
వారి వాక్కుల రసవదర్థ
ధ్వని మహత్వ కవిత్వ వివృతిక్
సలిపి రెందుకు మర్త్యులే.

క్షుత్పిపాసల కవల తీరని
ప్రాణిరాగ బుభుక్ష యున్నది.
ఏతదాప్యాయన నివేదన
కవిత యనిరి మహాకవీ!

కావ్యమును రూపించె 'విబుధో
ద్యాన'మని ఆనందవర్ధను,
డుపనిషత్తులు పలికెడి 'రసో
వై సహా' యటంచును కవీ!

కరుణ శృంగారములు రెండే
ఋతరస ప్రతిపత్తి నందెడి;
ఒకటి కలుషము కడుగు; మటొకటి
కాల్చు కాయము శుద్ధికై.

లోకమును చిత్రమని రార్యులు-
ప్రకృతి పురుష పరస్పరాంతర
విరహశోకము శ్లోకములుగా .
కవులు ధ్యానింతురు కవీ!

జన్మవర్ధన విలయములలో
త్రిగుణముల వలె నణగి పెనవడు
శోకమే బ్రహ్మాండ లీలా
బంధమౌనేమో కవీ!

పోయెరాజ్యము - రాక్షసుని పా
లాయె కులసతి - అష్టకష్టా
లొత్తవెడలిన రాముశోకము
కావ్యమాయె మహర్షికిన్.

రతిని విధవనుచేసి మాసిన
మగని ముందట ఏడిపించెను,
అజుని విధురునిచేసి యేడ్పిం
చెను మహాకవి-సత్కవీ!

పెంచి పాలించిన శకుంతల
అంపకాలపు డడరె కణ్వుడు;
స్నేహధారణ చిందగా విల
పించె యజ్ఞుడు విరహాతన్.

కలదు భేదము వివిధకరుణ క
లా శ్రుతిస్వరి భంగధారా
క్షాళితములగు కంఠముల; అది
సహృదయావర్జన కవీ!

తెగదు ప్రాతది - క్రొత్తదింకను
ముడివడదు లోకప్రవృత్తిని -
ఏఱుదాటుటొ? కొండ యెక్కుటొ?
తేటపడదీ సంధిలోన్.

యుద్ధములు ధర్మములు కావు - ప
రాక్రమము పాపాక్రమణ, మని
పలుకకలిగితి, మతిపురాతన
సంప్రదాయము కాదనన్.

ఉదయరవి తరుణాతపము, సం
ధ్యాద్యుమణి కాషాయ చిహ్నము,
అభిజిదుజ్వల దీప్తిలోని ప
రాపరములేమో కవీ!

రేవు తెలియదు నావ నడచును -
దర్శనంబొ ? విమర్శనంబొ ?
కఱకు మెత్తన లొఱయ పల్కాము;
నేడు వేదాంతిక కవీ !

★

శుభమ్

స్వస్తి నీ కరచరణాంగ శక్తికి,
జయము నీ శస్త్రాస్త్ర శిక్షకు,
దేశ రక్షా దీక్షితుండవు
భాయి ! సైనికకులమణీ !

తల్లిదండ్రులు తమ్ము లాప్తులు,
అశన శయన నివాస సుఖములు,
వదలి మైదానములు వలచెదు
భాయి ! సైనికకులమణీ !

నాళ్లు నరములు కొఱుకు చలిలో,
రక్తమాంసము లుడుకు వడలో,
ఓర్చి కిమ్మనకుండ నిలుతువు,
భాయి ! సైనికకులమణీ !

కోడి కూయగ మేలుకొందువు
మరతుపాకుల సాముకోసము,
ప్రాలుమాలవు బిద్ధకింపవు
భాయి ! సైనికకులమణీ !

ఎందుకని ప్రశ్నింప వెన్నడు,
ఔను కాదని వాదులాడవు,
వెనకముందాడక గమింతువు
భాయి ! సైనికకులమణీ !

అగ్నికురిసే బాంబులకు, పెను
సుళ్లు తిరుగుచు త్రెళ్లుపొగలకు,
భయమువిడి రొమ్మిచ్చి నిలుతువు
భాయి ! సైనికకులమణీ !

ఆపదలును అపాయములు దిన
గండములుగా కదియ జంకవు,
దేశరక్షణ కంకణము గొని
భాయి ! సైనికకులమణీ !

సూర్యచంద్రులు వాయు జలములు
కాలదేవత లోషధులు నిను
పృథివిలో కాపాడుదురుగా
భాయి ! సైనికకులమణీ !

★

తెనుగుతలి

అతిరమ్యాక్షర రీతులన్ నడప
నాద్యాచార్య : డర్ధధ్వని
ప్రతిమల్ తిక్కనదిద్ద, భాగవత
ధారన్ తేల్ప పోతన్న, గుం
పితముల్ పెద్దన తీర్చ, సూరన
నవోన్మేషంబు చిత్రింప, లా
లితయై శోభల నొప్పు
మా తెనుగుతల్లిన్ భక్తి భావించెదఁ.

★

ఎరుగనా ! అమలినలైన అబలలు తమ కన్నెరికమును మలినలైన మగువలకంటె చిరంతనంగా నిలుపుకొంటారు. కాగా కామస్పృహ తగలని నిత్యకన్యలో ఈన్యాయము ఎంత అధికంగా ఉంటుందో బోధపడుతుంది. అంతేకాదు, నేను ఇంకా దూరదూరం గమనింప సాహసిస్తాను. మలినం కాని ఇలాటి యౌవన సౌష్ఠవము ఎందుకు కళాసుస్థాపిత మయినదంటే, మాతృ స్వరూపమునందు అలాటి కన్యా తారుణ్యమూ అలౌకిక వైమాలిన్యమూ నిత్యంగా నిలిచి ఉంటుందని లోకమును నమ్మించడానికే.

—మైకల్ ఆంజిలో

★

రచనలు

లలిత

తృణకింకణం

కష్టకమల

స్నేహలత

తెనుగుతోట

స్వప్నకుమారం

ఆంధ్రావళి

జడకుచ్చులు

కన్నెపాటలు

మధుకలశం

రమ్యాలోకం

మాధురీ దర్శనం

రూపనవనీతం

ఉత్తరరామచరిత

దూతమత్తేభం

"Don't you know that chaste women retain their freshness far longer than the unchaste? How much more would this be the case of a virgin into whose heart there has never crept a lascivious desire! Nay, I will go farther and hazard the belief that such unsullied bloom of youth may have been miraculously wrought to convince the world of the virginity and perpetual purity of the Mother."

—*Michelangelo on Mother*